ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 22 జూలై 2024





కొండ పైనుంచి కిందకు రావడానికి బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు

# జీవీఎంసీలో.. రాజకీయ చదరంగం



**మారుతున్న సమీకరణలు**

**వైసీపీకి 12 మంది కార్పొరేటర్లు రాజీనామా**

- ఏడుగురు టీడీపీ, ఐదుగురు జనసేనలో చేరిక
- ప్రస్తుతం వైసీపీకి 47, టీడీపీకి 36, జనసేనకు పది మది సభ్యుల బలం
- బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఇండిపెండెంట్లు ఒక్కొక్కరు
- స్టాండింగ్ కమిటీ సభ్యుల విజయానికి 49 ఓట్లు అవసరం
- వైసీపీతో సమానంగా కూటమి బలం
- మరికొందరు వైసీపీని వీడి కూటమిలో చేరుతారని ప్రచారం
- ఉన్నవారిని కాపాడుకునే ప్రయత్నాల్లో వైసీపీ నేతలు
- వచ్చే నెల ఏడున జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహావిశాఖ నగరపాలకసంస్థ (జీవీఎంసీ)లో మారుతున్న రాజకీయ సమీకరణలు ఆసక్తిరేపుతున్నాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చేనెల ఏడున నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ పీఠంతో పాటు స్టాండింగ్ కమిటీలోని పదిస్థానాలను దక్కించుకోవడంపై కూటమి నేతలు గురిపెట్టారు. ఇందులో భాగంగా 12 మంది వైసీపీ కార్పొరేటర్లు ఆపార్టీని వీడి ఆదివారం టీడీపీ, జనసేనలో చేరిపోయారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 47కి తగ్గిపోగా, కూటమి బలం 47కి పెరిగింది. స్టాండింగ్ కమిటీని కైవసం చేసుకోవాలంటే కూటమికి మరో ఇద్దరు కార్పొరేటర్ల మద్దతు అవసరం. అయితే అదే సమయంలో టీడీపీలో అసమ్మతి కార్పొరేటర్ల మద్దతు కోసం వైసీపీ నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జీవీఎంసీలో ప్రస్తుత స్టాండింగ్ కమిటీ పదవీ కాలం ఈనెలాఖరుతో ... మిగతా 6వ పేజీలో

**విశాఖ కార్పొరేషన్‌లో వైసీపీకి షాక్**

- కూటమిలో చేరిన 12 మంది కార్పొరేటర్లు

- వివరాలు మెయిన్‌లో

**జీవీఎంసీ బలోపేతమే ధ్యేయం**

- పార్టీలో చేరిన కార్పొరేటర్లపై ఎలాంటి ఒత్తిడీ లేదు
- కూటమి నాయకులతో కలిసి పనిచేయండి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వార్త 6వ పేజీలో



తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన పార్టీల్లో చేరిన వైసీపీ కార్పొరేటర్లతో కూటమి నాయకులు

గిరి ప్రదక్షిణ చేసి తొలిపావంచా వద్దకు వస్తున్న భక్తులు



# పులకించిన సింహగిరి



అప్పన్న దర్శనానికి వెళ్తున్న భక్తులు

## విజయవంతంగా ముగిసిన గిరి ప్రదక్షిణ

**సుమారు పది లక్షల మంది పాల్గొన్నట్టు అంచనా**

- భక్తులతో పోటెత్తిన సింహాచలం

**సింహాచలం, జూలై 21:** సింహగిరి భక్త జన ప్రవాహంతో పులకించింది. గిరి ప్రదక్షిణ ఉత్సవం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు కొండదిగువ తొలిపావంచా నుంచి అప్పన్న పుష్పరథం భక్తుల హరి నామస్మరణల నడుమ బయలుదేరింది. అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక కూడలి, అప్పూఘర్, ఇసుకతోట, మద్దిలపాలెం, గురుద్వార, మాధవధార, ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా రాత్రి 10.30 గంటలకు సింహాచలం చేరుకుంది. భక్తులు ఆదివారం ఉదయం చేరుకోవడంతో ఆరు గంటల నుంచి 10 గంటల వరకు గోశాల కూడలిలో విపరీతమైన రద్దీ నెలకొంది. కాగా గిరి ప్రదక్షిణలో సుమారు 10 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు అధికారులు అంచనా వేశారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఎక్కువ మంది యువత ఉత్సవంలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన భక్తుల్లో కొందరు మెట్లమార్గంలో సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

**త్వరితగతిన దర్శనాలు**

ముందుగా ప్రకటించినట్టే ఆదివారం వేకువజామున మూడు గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం ఐదు గంటల వరకు సుమారు 10 వేల మంది భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, విద్యుత్ దీపాలను అమర్చారు. భక్తులకు దర్శనం అనంతరం నిత్యాన్న ప్రసాదం అందజేశారు. పీఠాపురానికి చెందిన ... మిగతా 6వ పేజీలో

# ఇన్‌చార్జి వీసీకి సవాళ్లు



శశిభూషణరావు



- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పడకేసిన పాలన
- గత వీసీ వివాదాస్పద నిర్ణయాలపై సమీక్షకు యత్నిస్తారా?
- ప్రసాదరెడ్డి మనిషనన్న ముద్ర చెరిపేస్తారా
- పీహెచ్‌డీ ప్రవేశాల వ్యవహారంలో నిగ్గుతేలేనా
- ప్రొఫెసర్ శశిభూషణరావు చర్యలపై సర్వత్రా ఆసక్తి

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ శశిభూషణరావుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. గత ఐదేళ్లలో వర్సిటీ పాలకుల కార్యకలాపాలతో ఏయూ ప్రతిష్ఠ దిగజారింది. అడ్డగోలు నిర్ణయాలతో చెడ్డపేరు తెచ్చారన్న భావన నెలకొంది. వీటన్నింటిని అధిగమించడానికి శశిభూషణరావు తీవ్రంగానే శ్రమించాలని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా గత వీసీ ప్రసాదరెడ్డి కోటరీకి చెందిన వ్యక్తి అన్న ముద్రను చెరిపేసుకోవాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందంటున్నారు.

ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రొఫెసర్ శశిభూషణరావు వర్సిటీలో ఏర్పాటుచేసిన కంచెను తొలగించారు. దీనిద్వారా తాను ఎవరి మనిషినీ కాదని నిరూపించుకునే ప్రయత్నం చేశారని చెబుతున్నారు. వర్సిటీలోని పీహెచ్‌డీ ప్రవేశాలపై దుమారం రేగుతోంది. అస్మదీయులకు ప్రొఫెసర్‌షిప్‌తో పాటు గైడ్లుగా అవకాశం కల్పించారని ప్రచారం ఉంది. టీడీఆర్ హబ్ పేరుతో పీహెచ్‌డీల్లో అడ్డగోలుగా ప్రవేశాలు కల్పించి దోచుకున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో వీటిపై సీనియర్ ప్రొఫెసర్ విమర్శలు గుప్పించారు. వీటిపైనా విచారణ జరిపించాల్సిన బాధ్యత ఉంది. టీడీఆర్ హబ్ డీన్‌పైనా ఆరోపణలున్నాయి. అతని నియామకం కూడా చెల్లదన్న ప్రచారం జరుగుతోంది. గత వీసీ ప్రసాదరెడ్డి అడ్జెంక్ట్ ప్రొఫెసర్లు, గౌరవ ప్రొఫెసర్లు పేరుతో పదుల సంఖ్యలో నియమించారు. వీరికి భారీగా వేతనాలను చెల్లిస్తున్నారు. పలు విభాగాల్లో ఈ తరహా ప్రొఫెసర్లు అవసరం లేకున్నా అస్మదీయులకు పందేరం వేశారు. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

**నిధులు వినియోగం లెక్క తేల్చాలి..**

ఐదేళ్లలో వర్సిటీలో పెద్దఎత్తున నిర్మాణాలను చేపట్టారు. రూసాతోపాటు పూర్వ విద్యార్థులు ఇచ్చిన రూ.కోట్ల వినియోగంలో గత వీసీ, ఇతర అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారన్నది ఆరోపణ. భవన నిర్మాణాల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు చెబుతున్నారు. టెండర్లు ... మిగతా 6వ పేజీలో

# తహసీల్దార్ల పైరవీలు!

**కీలకస్థానాల్లో పోస్టింగ్‌కు తీవ్ర ప్రయత్నాలు**

- గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వారిదే హడావిడి
- కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు
- సిఫారసు లేఖలతో కొందరు హల్‌చల్
- మంత్రికి అడిషనల్ పీఎస్‌గా వెళ్లేందుకు మరొకరి యత్నం
- ఎన్నికల బదిలీల్లో వచ్చిన వారంతా జిల్లాలోనే కొనసాగేందుకు ఎత్తులు
- పోస్టింగ్‌ల కోసం కలెక్టర్‌పై ఒత్తిళ్లు?




విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సందర్భంగా పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను వెనక్కి పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 22 తరువాత జిల్లాలో పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. అదే సమయంలో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్లను ఆయా జిల్లాలకు రిలీవ్ చేయనున్నారు.

జిల్లాలో 11 మండలాలుండగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, శ్రీకాకుళం రూరల్, సీతమ్మధార మండలాలకు ఎక్కువమంది పోటీపడుతున్నారు. దీంట్లో భీమిలి నియోజకవర్గంలో నాలుగు మండలాలకు మరింత ఎక్కువగా.. ఆనందపురానికి మరీ ఎక్కువగా పైరవీలు జరుగుతున్నాయని రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. పెందుర్తి తహసీల్దారు పోస్టుకు పలువురు పోటీ పడుతున్నారని చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ మండలాలతోపాటు మరో రెండుమూడు మండల తహసీల్దార్లగా పనిచేసిన అధికారులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారన్నది బహిరంగ రహస్యం. ల్యాండ్ పూలింగ్, డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీలో భారీగా వెనకేసుకున్నారని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం ఉంది. కొందరు తహసీల్దార్లు గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులతో అంటకాగుతూ యథేచ్ఛగా వ్యవహరించారని, ల్యాండ్‌పూలింగ్ వ్యవహారంలో పలు వివాదాలతో కొనసాగిన మండలంలో తహసీల్దారుగా పనిచేస్తూ ఈ ఏడాది జనవరి 31న పొరుగు జిల్లాకు బదిలీపై వెళ్లి, అక్కడ డీపట్టా భూములకు పెద్ద ఎత్తున ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారనే విమర్శలున్నాయి. గతంలో విశాఖలోనూ, ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాలో ఇష్టానుసారం వ్యవహరించిన ఈ అధికారి ఇప్పుడు ఆనందపురంలో పోస్టింగ్‌కు పెద్దఎత్తున పైరవీ చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో భీమిలి నియోజకవర్గంలో ఎక్కువ కాలం పనిచేసిన సమయంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ఒక అధికారి, ఉత్తరాంధ్రకు చెందిన మంత్రి వద్ద అడిషినల్ పీఎస్‌గా చేరేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో చేసిన అక్రమాలపై ఎవరైనా ఫిర్యాదుచేసి విచారణకు డిమాండ్‌చేస్తే తప్పించుకునేందుకు ఈ ఎత్తు వేసినట్టు ప్రచారం సాగుతోంది. ఇదిలావుండగా పొరుగు జిల్లా నుంచి వచ్చి జిల్లాలో పనిచేస్తున్న ఓ తహసీల్దారు ఇక్కడే కొనసాగేందుకు పైరవీలు చేస్తున్నారని సమాచారం. అతనిపై ఎక్కువ కోర్టు కేసులున్న నేపథ్యంలో ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారని భోగట్టా. ఇప్పటికే జిల్లాలో ఇద్దరు ముగ్గురు కూటమి ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారని కూడా ప్రచారం సాగుతోంది. రెవెన్యూ శాఖ నిబంధనల మేరకు ఎన్నికల సమయంలో ఏ జిల్లా నుంచి బదిలీపై వచ్చారో తిరిగి అదే జిల్లాకు వెళ్లాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి భూపరిపాలన ముఖ్య కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయినా రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఇక్కడే కొనసాగేలా ప్రయత్నించడంపై రెవన్యూవర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. ఇంకా ఈ అధికారి తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మధ్యాహ్నం తరువాత విధులకు హాజరై, రాత్రి 10, 11గంటల వరకు కార్యాలయంలో ఉంటారని, మిగిలిన సిబ్బందిని కూడా అప్పటివరకు ఉండాలని హుకుం జారీచేస్తుంటారన్న విమర్శలున్నాయి. ఈ అధికారి ఒత్తిడి భరించలేక ఇద్దరు గుమస్తాలు ఇప్పటికే సెలవులో వెళ్లిపోయారు. రోజువారీ ఖర్చులను సిబ్బందే భరించాలని ఆదేశిస్తారని, కొందరు సిబ్బంది ఎదురుతిరిగితే పలువురు కూటమి నాయకులు తనకు మిత్రులంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇదే అధికారి కొనసాగితే కార్యాలయ సిబ్బంది అంతా మూకుమ్మడి ... మిగతా 6వ పేజీలో

**ఘనంగా గురు పౌర్ణమి**



గురు పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈస్ట్‌పాయింట్ బాబా ఆలయంలో స్వామికి వివిధ రకాల మిఠాయిలు, పళ్లను నైవేద్యంగా సమర్పించారు.

## బదిలీలకు ర్యాంకర్ ఎస్‌ఐల ఎదురుచూపులు

- ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీ

**విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** పోలీస్‌శాఖలో ర్యాంకర్ ఎస్ఐలు బదిలీ కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు విశాఖ రేంజ్ పరిధిలోని మూడేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసినవారు, 2019 ఎన్నికల్లో ఒక జిల్లాలో పనిచేసి ఎన్నికల నాటికి అదే జిల్లాలో పనిచేస్తున్న ఎస్ఐ,సీఐలతోపాటు డీఎస్పీలను ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు రేంజ్ డీఐజీ బదిలీ చేశారు. వీరిలో ర్యాంకర్ ఎస్ఐలు ఉన్నారు. కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా పదోన్నతి పొందినవారిని ర్యాంకర్ ఎస్ఐలుగా పేర్కొంటారు. వీరంతా ఏజిల్లాలో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరితే ఎస్ఐగా అదే జిల్లాలో పనిచేస్తుంటారు. అయితే ఇటీవలి సాధారణ ఎన్నికల సమయంలో సుమారు 70 మందిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ర్యాంకర్ ఎస్ఐలను గతంలో పనిచేసిన జిల్లాలకు పంపాలి. అయితే విశాఖ రేంజ్ మినహా మిగిలిన రేంజ్‌ల్లో బదిలీచేశారు. కానీ ఇక్కడ ఇంతవరకూ ప్రక్రియ చేపట్టకపోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



# సరకుల వివరాలేవీ?

**నగరంలో పలువురు ఎండీయూల తీరిది**

- ఫిర్యాదుకు డీలర్లు సన్నద్ధం

విశాఖపట్నం/మర్రిపాలెం/మద్దిలపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పలువురు ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) ఆపరేటర్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కార్డుదారులకు పంపిణీ చేసిన సరకుల వివరాలను సంబంధిత డీలర్లకు చెప్పడం లేదన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతప్రభుత్వం దన్నుతో కొందరు ఎండీయూలు ఇష్టానుసారంగా వ్యవహరించి డీలర్లు, పౌరసరఫరాల శాఖకు తలనొప్పులు తెస్తున్నారన్న వాదన ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొందరు ఎండీయూలు మారారని, మరికొందరు ఇంకా అదే ధోరణిలో ఉన్నారని డీలర్లు వాపోతున్నారు. ప్రతినెలా ఒకటోతేదీ నుంచి 17 లేదా 18 వరకు సరకులు పంపిణీ చేసిన తరువాత తన పరిధిలో ఎంత సరకు పంపిణీ చేశారు? డబ్బులు, ఖాళీ సంచుల లెక్కలు డీలర్లకు అప్పగించాలి. మిగిలిన సరకుల వివరాలు చెబితే ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తారు. అయితే కొందరు ఎండీయూలు వివరాలు చెప్పడం లేదు. మర్రిపాలెం ప్రాంతంలో ఓ డీలరు అందజేసిన సరకుల వివరాలపై ఎండీయూ లెక్కలు చెప్పడంలేదని వాపోయారు. ఇసుకతోట, హెచ్‌బీకాలనీ ప్రాంతంలో మహిళా డీలరును ఎండీయూ బెదిరిస్తున్నారని చెబుతున్నారు. మద్దిలపాలెం ప్రాంతంలో మరో ఎండీయూ సంబంధిత డీలరుకు లెక్కలు చెప్పడంలేదన్న ఫిర్యాదులున్నాయి. తాటిచెట్లపాలెం, కోటవీధి ప్రాంతంలో ఇద్దరు ముగ్గురు ఎండీయూలు బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడున్నారని, ఖాళీ సంచుల లెక్కలు చెప్పడంలేదని కొందరు డీలర్లువాపోతున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు హెచ్చరించారు. అయినా కొందరి తీరు మారలేదని డీలర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండుమూడు రోజుల్లో ఎండీయూలు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు.



## 'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

**అల్లిపురం, జూలై 21:** సీపీఐ, ప్రజా సంఘాల నాయకులపై గత వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయాలని గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పనిచేస్తున్న ప్రజా సంఘాల నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. వీటిని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కకసి రెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రహిమాన్, పి.చంద్రశేఖర్, కె. అచ్యుతరావు తదితరులు ఉన్నారు.

## కన్యకా పరమేశ్వరి దేవస్థానం నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

**మహారాణిపేట, జూలై 21:** నగరంలోని ప్రముఖ కన్యకా పరమేశ్వరి ఆలయ నూతన కార్యవర్గం నియమితులైంది. ఆదివారం ఆలయంలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో 2024-26 సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆరిశెట్టి దినకర్ అధ్యక్షుడిగా, పెనుగొండ కామరాజు కార్యదర్శి, దొమ వెంకట బాలాజీ కుమార్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఏడుగురు ఉపాధ్యక్షులుగా, ఏడుగురు సహాయ కార్యదర్శులు, మరో 28 మంది కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. అనంతరం వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

## వర్షానికి కూలిన ఇల్లు



బాధితుని నుంచి వినతి స్వీకరిస్తున్న టీడీపీ నేత సుజాత, వీఆర్వో

**కంచరపాలెం, జూలై 21:** గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 55వార్డు పరిధి ధర్మానగర్‌లో ఎస్.రవి కుటుంబానికి చెందిన పెంకుటిల్లు ఆదివారం కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న టీడీపీ వార్డు నాయకురాలు ఈ తలపాక సుజాత, వీఆర్వో బాబూలాల్, వార్డు కమిటీ ప్రతినిధులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి సమస్య తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని బాధితునికి హామీ ఇచ్చారు. వార్డు కమిటీ ప్రతినిధులు బాలకృష్ణ, చంటి పాల్గొన్నారు.

## కబడ్డీ సంఘాలకు న్యాయం చేయాలి



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రమిస్తున్న కబడ్డీ సంఘ ప్రతినిధులు

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 21:** రాష్ట్ర, జిల్లా కబడ్డీ సంఘాలకు కూటమి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర, జిల్లా కబడ్డీ సంఘాల ప్రతినిధులు ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్ గుర్తింపు కలిగిన ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు గత ఐదేళ్లుగా వైసీపీ నాయకుల కబంధ హస్తాల్లో నలిగిపోయి తీవ్ర సమస్యలను ఎదుర్కొన్నారన్నారని రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు ఈ సందర్భంగా వివరించారు. స్పందించిన పల్లా శ్రీనివాసరావు క్రీడాప్రాధికార సంస్థ అధికారికి ఫోన్ చేసి అధికారిక గుర్తింపు కలిగిన కబడ్డీ సంఘాన్ని నిబంధనల ప్రకారం వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధులు బాబూరావు, ఉమాశంకరబాబు, గణపతిరావు, కోటేశ్వరరావు త పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

**కంచరపాలెం, జూలై 21:** స్థానిక ఐటీఐ జంక్షన్ గణేష్‌నగర్‌లో నల్లా దేవి, భర్త అప్పన్న ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నారు. ఈనెల 11న పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లిన దేవి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త అప్పన్న ఫిర్యాదుపై సీఐ భాస్కరరావునేతృత్వంలో హెచ్‌సీ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశం

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 21:** అసోంలో జరిగిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) వార్షిక జనరల్ బాడీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఏపీబీఏ) కార్యదర్శి అంకమ్మ చౌదరి పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈ సమావేశానికి అసోం ముఖ్యమంత్రి హిమాన్త బిష్వ శర్మ హాజరయ్యారు. ఏపీబీఏ కార్యదర్శి అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ఆంధ్రలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు.



సీతమ్మధార ఆలయంలో షిర్డీసాయికి అన్నాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు



అల్లిపురం ఆలయంలో షిర్డీసాయి

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

▸▸ షిర్డీసాయి ఆలయాల్లో పూజలు

**సీతమ్మధార, జూలై 21:** సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్ షిర్డీమార్గ్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి పైల సన్నిబాబు ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం అన్నాభిషేకం చేశారు. అనంతరం అన్నదానప్రసాద వితరణ చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో షిర్డీ సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు రామారావు శర్మ, యు. మహేష్ పూలమాలలతో బాబాను అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ప్రసాదం వితరణ చేశారు. 23వ వార్డు చైతన్యనగర్‌లోని వినాయక, సాయిబాబా, అయ్యప్ప స్వామి ఆలయంలో సప్తాయతన ఆలయం సంఘం ఆధ్వర్యంలో సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు. మహిళా భక్త బృందం పాటలు ఆలపించారు.

**డాబాగార్డెన్స్:** డాబాగార్డెన్స్ శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు బులుసు సాయికృష్ణశర్మ బాబాకు పంచామృత అభిషేకం, అన్నాభిషేకం జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవో జీవీ రమాబాయి, కేఎం రెడ్డి పాల్గొన్నారు.

**అక్కయ్యపాలెం:** గ్రేటర్ 43వ వార్డు సంగం ఆఫీసు జంక్షన్ మూడు గుళ్ల సమీపాన సాయిబాబా ఆలయంలో సాయిశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, విశాఖపార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఉత్తర నియోజకవర్గ నేత వెల్లంకి భరత్ హాజరయ్యారు. వీరికి షిర్డీ సాయిశ్వర సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డేటి మోహన్‌రావు ఘన స్వాగతం పలికారు. బాబా చిత్ర పటాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ చైర్మన్ కొయిలాడ వేణుగోపాల్, కార్యదర్శి వాసంశెట్టి మురళీకృష్ణ, కోశాధికారి బొడ్డేటి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**అల్లిపురం:** అల్లిపురం ప్రియాంక విద్యోదయ పాఠశాల సమీపాన శ్రీ సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిదర్బార్ ప్రాంగణంలోని సాయిబాబాను వెండి మకర తోరణంతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు జరిపారు. పాదుకపూజ, అర్చనలు, ప్రత్యేక పూజల చేశారు.చైర్మన్ ఎస్‌ప్రసన్న, కార్యదర్శి, పి.శ్రీనివాస సుబ్రహ్మణ్య శాస్త్రి, గ్రంధి రమ పాల్గొన్నారు.

**మురళీనగర్:** ఎన్‌జీజీఎస్ కాలనీ, బర్మాక్యాంప్, మాధవధార ప్రాంతాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాధవధార హైస్కూలు సమీపాన శ్రీ గౌరీరామలింగేశ్వర ఆలయ సముదాయంలోని సాయినాథుని ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు హాజరయ్యారు. సాయిబాబాకి అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను మర్యాదలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కమిటీ అధ్యక్షులు టి.నారాయణరెడ్డి, కార్యదర్శి సనపల. వరప్రసాద్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో 56 మంది గురువులకు పూజా కార్యక్రమం చేపట్టారు. బర్మాక్యాంప్ నూకాంబిక ఆలయంలో సాయినాథునికి, మాధవధార, గాంధీనగర్ ఆలయాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు.

**కంచరపాలెం:** కంచరపాలెం పరిసర ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా విశిష్ట పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిక్కవానిపాలెం, గంగన్ననగర్, రెడ్డికంచరపాలెం, తుమ్మడిపాలెం, 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీసాయికి అన్నాభిషేకం, పాలాభిషేకాలు చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ఊంజల్ సేవ నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు.





అలంకరణలో దాబాగార్డెన్స్ షిర్డీసాయి, గండిబాబ్జీకి చిత్రపటం అందిస్తున్న దృశ్యం





నక్కవానిపాలెం , చైతన్యనగర్ మందిరాల్లో అలంకరణల్లో షిర్డీసాయి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

## సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

**మహారాణిపేట:** మహారాణిపేటలోని కేజీహెచ్ వద్ద ఇసుకకొండ శ్రీ రమా సత్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. పౌర్ణమి గుడిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రదక్షిణలు ఆచరించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు సింహాచలం గిరి ప్రదక్షణ పూర్తి చేసిన పలువురు భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతాలను చేశారు.



ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి

# జీవీఎంసీ బలోపేతమే ధ్యేయం

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

**విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అతి పెద్ద నగరం విశాఖను ఆర్థికంగా బలోపేతం చేయడమే తెలుగుదేశం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లలో ఏడుగురు తెలుగుదేశం, ఐదుగురు జనసేనలో చేరిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. నగరం అభివృద్ధి చెందాలంటే జీవీఎంసీ కౌన్సిల్ సహకారం అవసరమన్నారు. సుమారు 25 వేలమంది జనాభాకు ఒకరు చొప్పున ప్రాతినిథ్యం వహిస్తున్న కార్పొరేటర్లకు ప్రజలతో నేరుగా సంబంధాలు ఉంటాయన్నారు. కార్పొరేటర్లగా విజయం సాధించాలంటే పార్టీ పలుకుబడి 25 శాతం దోహదం చేస్తే 75 శాతం వ్యక్తిగత చరిష్మా ఉంటుందన్నారు. అందుకే నగరాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైసీపీ కార్పొరేటర్లను కూటమిలోకి ఆహ్వానించామన్నారు. కూటమిలో చేరిన వారిలో సారిపల్లి గోవింద, కంపా హనోక్, బి.నరసింహపాత్రుడు, రాజాన రామారావు, ఇల్లపు వరలక్ష్మి, లొడగల అప్పారావు, కోడూరు అప్పలరత్నం తెలుగుదేశం పార్టీలో, ఆళ్ల లీలావతి, పెద్దింటి ఉషశ్రీ, కంటిపాముల కామేశ్వరి, పి. పూర్ణశ్రీ, బి.సూర్యకుమారి జనసేన పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిని పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆహ్వానించగా, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కండువా వేసి ఆహ్వానించారు. జనసేనలోకి చేరిన ఐదుగురికి వేదికపై ఆహ్వానించారు. వారికి రెండు మూడురోజుల్లో విజయవాడలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కండువావేస్తారని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రకటించారు.

**మేయరు పీఠంపై గురి**

మేయరుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ప్రస్తుతం ఉన్న గడువు తగ్గించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కూటమిలో చేరిన వారికి తగిన గౌరవం ఉంటుందని, అదే సమయంలో వార్డుల్లో కూటమి నాయకులు, కేడర్‌ను సమన్వయం చేసుకోవాలన్నారు. పార్టీ కేడర్ అధైర్యపడొద్దని హితవు పలికారు. వైసీపీని వీడి రావాలని ఎవరిపైనా ఒత్తిడి చేయలేదని, వారంతా స్వచ్ఛందంగానే పార్టీ మారారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ సూచనల మేరకు ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీని వీడేందుకు ఎక్కువమంది కార్పొరేటర్లు నిర్ణయించారన్నారు. గత మూడేళ్లలో అడ్డగోలుగా వ్యవహరించిన వారిని పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చేవారు టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. వైసీపీ విధానాలకు, కూటమి విధానాలకు చాలా తేడా ఉందని గుర్తుచేశారు. అదే సమయంలో వైసీపీ కార్పొరేటర్లు వచ్చిన వార్డుల్లో టీడీపీ నాయకులు, కేడర్‌కు సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐదేళ్లలో నగరం అనేక రంగాల్లో వెనుకబడిందని, గత పాలకులు విశాఖను నిర్లక్ష్యంచేశారని ఆరోపించారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జీవీఎంసీలో పెద్దఎత్తున అభివృద్ధి జరగాలని పిలుపునిచ్చారు. అధికారమదంతో, బెదిరింపులకు పాల్పడి వైసీపీ జీవీఎంసీలో అధికారం చేజిక్కించుకుందని, ప్రజామోదంతో కాదన్నారు. రాజకీయ సమీకరణలు మారిన తరుణంలో వైసీపీ నుంచి కూటమిలోకి కార్పొరేటర్లను చేర్చుకోవడానికి ఎమ్మెల్యేలను సంప్రదించి వారి అంగీకారం తీసుకున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన కార్పొరేటర్లు కూటమి తరపున పోటీచేసి ఓడిన అభ్యర్థులు, నేతలు, కేడర్‌ను సమన్వయం చేసుకోవాలని సూచించారు. గేట్లు ఎత్తితే వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందని, అడ్డగోలుగా వ్యవహరించిన వారికి ప్రవేశం లేదన్నారు. వైసీపీమునిగిన నౌకగా అభివర్ణిస్తూ, అందులో ప్రయాణించిన వారంతా ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో అడ్డగోలుగా జరిగిన అవినీతిని వెలికితీసి ప్రజలకు చెప్పాలని పిలుపునిచ్చారు. దక్షిణ ఎమ్మెల్యే చెల్లుబోయిన వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి రాక్షస పాలనకు తెరపడిందన్నారు. జనసేనలో చేరిన వారికి రెండు మూడురోజుల్లో అధినేత పవన్‌కల్యాణ్ కండువాలు వేసి ఆహ్వానిస్తారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పార్టీ నేతలు పొలమరశెట్టి శ్రీనివాసరావు, చోడే పట్టాభి, జనసేన నాయకులు శివప్రసాదరెడ్డి, పసుపులేటి ఉషాకిరణ్, భీశెట్టి వసంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

## టౌన్‌హాల్ పరిరక్షణకు చర్యలు తీసుకోండి



టౌన్‌హాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**జగదాంబ కూడలి, జూలై 21:** విశాఖ చరిత్రకు ఆనవాలుగా నిలిచిన బ్రిటిషు కాలం నాటి టౌన్‌హాల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రేటర్ 38 వార్డు పరిధిలోని ఈ టౌన్‌హాల్ దుస్థితిపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో ఎక్కడ చూసినా మద్యం, బీరు బాటిళ్లను గుర్తించిన ఆయన అవాక్కయ్యారు. వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి, టౌన్‌హాల్‌ను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ టౌన్‌హాల్‌ను రూ. 10 కోట్లతో ఇటీవల ఆధునికీకరించారు. ప్రస్తుతం టౌన్‌హాల్, విశాఖ క్లబ్ పరిసరాలు గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌లకు నిలయంగా మారాయి. ఈ ప్రాంతం జనసంచారం తక్కువగా ఉండడంతో వీరు టౌన్‌హాల్‌ను అనుకూలంగా మలచుకున్నారు. విశాఖ క్లబ్ సభ్యులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. పాతనగరం వాసులకోసం నిర్మించి వాటర్ ట్యాంకు పరిసరాలు దుర్భరంగా మారాయి. ఈ నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం పర్యటించి పరిస్థితులను పరిశీలించారు.

## జీవీఎంసీలో... రాజకీయ చదరంగం

... 5వ పేజీ తరువాయి

ముగుస్తుంది. తక్షణం కమిటీకి ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. సాధారణ ఎన్నికల హడావుడి, తర్వాత కమిషనర్ బదిలీ వంటి పరిణామాలతో నాలుగు నెలలుగా స్టాండింగ్ కమిటీ సమావేశం జరగలేదు. దీంతో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, రోజువారీ ఖర్చులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీకి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో వచ్చేనెల ఏడున స్టాండింగ్ కమిటీకి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్, ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిర ప్రసాద్ సోమవారం దీనికి సంబంధించి ప్రకటన చేసే అవకాశం ఉంది.

**అప్రమత్తమైన కూటమి నేతలు**

స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు అప్రమత్తమయ్యారు. సాధారణ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేయడంతో జీవీఎంసీ మేయర్ పీఠంతో పాటు స్టాండింగ్ కమిటీని కూడా కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీని కోసం కౌన్సిల్‌లో బలం పెంచుకునే చర్యలు ప్రారంభించారు. జీవీఎంసీలో ప్రస్తుతం వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు, టీడీపీకి 29 మంది, జనసేనకు ఐదుగురు కార్పొరేటర్ల బలం ఉంది. వీరుకాకుండా బీజేపీ, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఉన్నారు. తాజాగా ఆదివారం 12 మంది కార్పొరేటర్లు వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. వీరిలో ఏడుగురు టీడీపీలో, ఐదుగురు జనసేనలో చేరిపోయారు. దీంతో టీడీపీ బలం 36కి, జనసేన బలం పదికి మొత్తంగా బీజేపీతో కలుపుకుంటే కూటమి బలం 47కి పెరిగింది. అదే సమయంలో వైసీపీ బలం 47కి తగ్గిపోయింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా, ఒక్కస్థానం దక్కించుకోవాలంటే 97 మంది కార్పొరేటర్లలో కనీసం 49 మంది మద్దతు అవసరం. అంటే ఇరుపక్షాలకు మరో ఇద్దరు సభ్యులు మద్దతు కావాలి. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ప్రస్తుతం వైసీపీకి మద్దతు ఇస్తుండగా, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల నిర్ణయం కీలకంగా మారనుంది. వీరిద్దరూ కూటమికి మద్దతు తెలిపితే కూటమి అభ్యర్థులు, ఒకవేళ వైసీపీకి మద్దతిస్తే వైసీపీ సభ్యులు స్టాండింగ్ కమిటీలో విజయం సాధిస్తారు. ఈ నేపథ్యంలో మరో పది మంది కార్పొరేటర్లను చేర్చుకునే దిశగా కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. వారంతా వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు, వార్డులోని నేతలు, కార్యకర్తల అభ్యంతరాల నేపథ్యంలో తీసుకోలేదని ప్రచారం జరుగుతోంది. అభ్యంతరాల్లేని కార్పొరేటర్లలో కనీసం పది మందిని చేర్చుకుంటామని కూటమి నాయకులు ప్రకటించడంతో వైసీపీ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పుడున్న 47 మంది కార్పొరేటర్లు చేజారిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహరచన చేస్తున్నారు. కొత్తగా కార్పొరేటర్ల చేరికల నేపథ్యంలో టీడీపీ, జనసేన కార్పొరేటర్లలో నెలకొన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని యత్నిస్తున్నారు. వారి మద్దతుని రాబట్టుకోవడం ద్వారా స్టాండింగ్ కమిటీలో సగం స్థానాలైనా కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఇన్‌చార్జి వీసీకి సవాళ్లు

... 5వ పేజీ తరువాయి

లేకుండానే పనులు కట్టబెట్టినట్టు చెబుతారు. ఐదేళ్లలో వర్సిటీకి వచ్చిన నిధులు, వినియోగించిన తీరు, అభివృద్ధికి వెచ్చించిన మొత్తాలపై ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ పేరుతో నిధుల దుర్వినియోగం పైనా నిగ్గుతేల్చాలంటున్నారు.

**ఎత్తేసిన సబ్జెక్టుల పరిస్థితి..?**

అడ్మిషన్లు తగ్గాయంటూ గత పాలకులు కొన్ని సబ్జెక్టులకు మంగళం పాడే శారు. వీటిని పునరుద్ధరించాల్సి ఉంది. ఆయా విభాగాల్లో పనిచేసిన 250 మందికిపైగా గెస్ట్‌ఫ్యాకల్టీను తొలగించారు. దూరవిద్యను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. బయటి నుంచి వచ్చిన ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇక్కడి నుంచే ప్రక్షాళన ప్రారంభించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. డబ్బు వసూలు చేసి పరీక్ష కేంద్రాల సంఖ్యను పెంచడం, ఎత్తేసిన స్టడీ సెంటర్లను పునరుద్ధరించడం, ఎయిడెడ్ కాలేజీల నుంచి తీసుకువచ్చిన సిబ్బందిని వెనక్కి పంపడం వంటి అంశాలపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి నెలకొంది. వర్సిటీలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌తోపాటు అవసరం లేకున్నా మరో 50 మంది ప్రైవేట్ సెక్యూరిటీని గత వీసీ నియమించారు. దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది.

**వృక్షాల తొలగింపు, రవాణాపై..**

వర్సిటీలోని అనేక విభాగాల వద్ద వందలాది వృక్షాలను తొలగించారు. నార్త్ క్యాంపస్‌లో చెట్లు, వృక్షాలను కూల్చి మైదానం చేసేశారు. ఈ కలపను అక్రమంగా తరలించారన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఇక్కడ భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేయించారు. ఇందుకు వర్సిటీ నిధులు వెచ్చించినట్టు చెబుతున్నారు. ఎవరి స్వలాభం కోసం ఇదంతా చేశారో తేల్చాల్సి ఉంది. ఇప్పటికీ వర్సిటీలోని విద్యార్థులకు గంజాయి సరఫరా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సెక్యూరిటీని పటిష్ఠం చేయడంతోపాటు ఈ తరహా వ్యవహారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**విచారణకు ఆదేశించే అవకాశం..**

వర్సిటీలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈలోగానే ఇన్‌చార్జి వీసీ సమీక్షించి సమాచారాన్ని సేకరించడం మేలంటున్నారు. దీంతో పాటు వర్సిటీలోని కీలక అంశాలపై దృష్టి సారించి చక్కదిద్దాల్సి ఉందని చెబుతున్నారు.

## తహసీల్దార్ల పైరవీలు!

... 5వ పేజీ తరువాయి

సెలవులో వెళ్లేందుకు యోచిస్తున్నారని తెలిసింది. కాగా విస్తీర్ణం పరంగా జిల్లా చిన్నదైనా ఇక్కడ భూములకు విలువ ఎక్కువ. వందల ఎకరాలకు సంబంధించి కోర్టు కేసులు ఉండడం, రాష్ట్రంలో ఎక్కువగా జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఎంతో ప్రాధాన్యత ఉంది. అందువల్ల సమర్థులను తహసీల్దార్లుగా నియమించాలని జిల్లా అధికారులు యోచిస్తున్నారు. అయితే కీలక మండలాల్లో పోస్టింగ్ కోసం పలువురు రాజకీయ నేతల చుట్టూ తిరుగుతూ సిఫారసు లేఖలు సంపాదిస్తున్నారు. దీంతో పోస్టింగ్‌ల వ్యవహారంలో ఇప్పటికే కలెక్టర్‌పై ఒత్తిడి మొదలైందని ప్రచారం సాగుతోంది.

## పులకించిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

ఆధ్యాత్మిక సంస్థ కదంబం, దద్దోజనం, చక్కెర పొంగలి, ఒడిశాకు చెందిన ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయక్ దాసుడి బృందం పులిహోర, సింహగిరి వర్తకుల సంఘం ఆధ్వర్యంలో పొంగలి ప్రసాదాలను వితరణ చేశారు. ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవం విజయవంతం కావడానికి కృషి చేశారు.

**సేవలందించిన 45 ఆర్టీసీ బస్సులు**

దేవస్థానం సుమారు రూ.10 లక్షలు చెల్లించి 45 ఆర్టీసీ బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగించింది. అవన్నీ రద్దీగా మారడంతో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన రాకపోకలు సాగించారు. తొలిపావంచా వద్ద భక్తులు లక్షలాదిగా కొబ్బరికాయలను కొట్టి ప్రదక్షిణలను ప్రారంభించడంతో టన్నుల కొద్దీ కొబ్బరిముక్కలు పోగయ్యాయి. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్టర్ వ్యాన్‌లు ఏర్పాటు చేసి, జేసీబీ సాయంతో వాటిని ఎప్పటికప్పుడు తరలించారు.

## విజయవాడ కనకదుర్గకు సారె సమర్పణ



కనకదుర్గకు సారె సమర్పిస్తున్న కనకమహాలక్ష్మి ఆలయ అధికారులు

**పూర్ణామార్కెట్, జూలై 21:** విజయవాడ కనక దుర్గ అమ్మవారికి కనక మహాలక్ష్మి దేవస్థానం తరపున ఆదివారం సారె అందజేశారు. ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి వి. రాంబాబు, ప్రధాన అర్చకులు కె. శ్రీనివాస శర్మ, వేదపండితులు సీహెచ్‌ఎల్‌ఎన్ అవధానులు, హనుమాన్ శర్మ దుర్గమ్మ ఆలయానికి వెళ్లి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. దుర్గమ్మ శాకంబరి ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా సారె సమర్పించడం అనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో అక్కడి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## వెలిగిన వీధి దీపాలు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**జగదాంబ కూడలి, జూలై 21:** వన్‌టౌన్‌లోని వాచ్‌హౌస్ శివాలయం మెయిన్ రోడ్డు నుంచి పూర్ణామార్కెట్ వరకు వీధి దీపాలను జీవీఎంసీ విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరించారు. ఇటీవల 'ఆంధ్ర జ్యోతి'లో 'వన్‌టౌన్‌లో అంధకారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు వీధి దీపాలను మార్చారు. సమస్య పరిష్కారంతో వ్యాపారులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పూర్ణామార్కెట్ రోడ్డులో వెలుగుతున్న దీపాలు



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

## స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి

**ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు**

**కూర్మన్నపాలెం, జూలై 21:** స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసేలా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,256వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ఉక్కు కర్మాగార పరిరక్షణకు ఎంపీలకు దిశా నిర్దేశం చేయడం హర్షణీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాన్ని ఎలాగైతే కూటమి నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో.. అదేవిధంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును నష్టాల వైపునకు మళ్లించడం, కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి దిగజార్చడం పారిశ్రామిక అభివృద్ధా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన 'సీ' ప్రతినిధులు



రామ్మోహన్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

**ఉక్కుటౌన్‌షిప్, జూలై 21:** ఉక్కు కర్మాగారానికి పూర్తి స్థాయిలో సహకరించవలసిందిగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం (సీ) ప్రతినిధులు కోరారు. శ్రీకాకుళంలో ఆదివారం ఆయనను కలిసి పలు సమస్యలను విన్నవించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకునేలా చూడాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా చర్యలు తీసుకోవాలని, సెయిల్‌లో విలీనమయ్యేందుకు కృషి చేయాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో 'సీ' ప్రతినిధులు కేవీడీ ప్రసాద్, నరసింహ, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రశాంత్ నాయక్, శ్రీకాంత్, శ్రీనివాసరావు ఉన్నారు.

## నేడు శ్రవణా నక్షత్రం పూజలు

**వేపగుంట జూలై 21:** నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరాలయంలో సోమవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, భక్తి గీతాలను ఆలపించనున్నారు.

## మానసిక ప్రశాంతతకు యోగా చేయాలి

**అగనంపూడి, జూలై 21:** ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద ఆదివారం అఖండ యోగా బట్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ముంబై ప్రతినిధి గణేశ్ భాయిజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలను వివరించారు. ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక భక్తి భావాలను అలవాటు చేసుకోవడంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగా చేయాలన్నారు. అనంతరం సంస్థ జిల్లా ప్రతినిధులు సోమేశ్వరి, శ్యామల, సత్యలను ఘనంగా సత్కరించారు. సంస్థ ప్రతినిధులు బీకే వేణి, రామకోటి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలిస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 56, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 16, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 40, బీరకాయలు 24, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 34, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 145, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | -- 95 |
| ఫారం ధర | -- 115 |
| విత్ స్కిన్ | -- 200 |
| స్కిన్‌లెస్ | -- 210 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..



గాజువాక ప్రసన్నసాయి ధ్యాన మందిరంలో క్షీరాభిషేకంలో పాల్గొన్న భక్తులు



86వ వార్డు శాతవాహన నగర్‌లో సాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

# సాయినాథునికి భక్త నీరాజనం

**గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

**భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

**గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని సాయినాథుని ఆలయాలు బాబా నామస్మరణతో మార్మోగాయి. ఓం సాయి.. శ్రీసాయి.. జై జై సాయి అంటూ భక్తులు పూజాది కార్యక్రమాల్లో మునిగితేలారు. ఆదివారం వేకువజాము నుంచే గాజువాక, కూర్మన్నపాలెం, పెదగంట్యాడ, అగనంపూడి, అక్కిరెడ్డిపాలెం, పెందుర్తి, వేపగుంట, ఎన్ఏడీ, గోపాలపట్నం, మల్కాపురం, తదితర ప్రాంతాల్లోని షిర్డీ సాయిబాబా ఆలయాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. సాయినాథునికి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది భక్తులు పాల్గొన్నారు.**



దయాళ్‌నగర్‌లో సాయినాథున్ని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించిన దృశ్యం

**గాజువాక, జూలై 21:** గాజువాక ప్రసన్నసాయి ధ్యాన మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి సాయినాథున్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

**కూర్మన్నపాలెం:** గ్రేటర్ 86వ వార్డు శాతవాహన నగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయంలో అర్చకులు వెంకట శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి 101 కలశాలతో సుమారు వెయ్యి లీటర్ల పాలతో భక్తుల చేతుల మీదుగా సామూహిక అభిషేకం నిర్వహించారు. వేకువజాము నుంచే సాయినాథునికి పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, హోమాలను జరిపారు. తెల్లవారుజాము ఐదు గంటలకు బాబాను వెండి పల్లకీలో ఊరేగించగా, దత్తసాయి భజన కమిటీ ఆధ్వర్యంలో సంకీర్తనలను ఆలపించారు. దత్త సాయి మందిర కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. వందలాది మంది భక్తులకు రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు బి.శేషగిరిరావు, పి.ధనుంజయరెడ్డి, వి.రామచంద్రరావు, సీహెచ్ సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డు ఆటోనగర్, కుంచుమాంబ కాలనీ, 71వ వార్డు శ్రీనగర్, విశ్వేశ్వరాయనగర్, 87వ వార్డు వడ్లపూడి, కణితి, 86వ వార్డు రాజీవ్‌నగర్, కాశీపాలెం, 88వ వార్డు దువ్వాడలోని సాయినాథుని ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను జరిపారు. వేకువజాము నుంచే ఆయా ఆలయాల్లో పూజలు జరిపి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

**అక్కిరెడ్డిపాలెం:** తుంగ్లాం షిర్డీ సాయి మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు సాయినాథున్ని దర్శించుకున్నారు.

**పెదగంట్యాడ:** దయాళ్‌నగర్‌లో షిర్డీ సాయి ఆలయంలో బాబాకు అర్చకులు నాగబాబు శర్మ ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, పుష్పార్చన చేశారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల నితీశ్‌రెడ్డి, ప్రణీత దంపతులు తొలి పూజలో పాల్గొన్నారు. అనంతరం సాయినాథున్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పూలతో అలంకరించగా దయాళ్‌నగర్, వికాస్‌నగర్, పెదగంట్యాడ, సిద్ధేశ్వరం ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్వై నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లిముక్కులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు, అభిషేకాలు చేసి పలు రకాల స్వీట్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పులి వెంకట రమణారెడ్డి, డి.సింహాచలం, డీఎస్ఎన్ రెడ్డి, పి.కుంచారావు, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

**అగనంపూడి:** ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలోని స్వామివారిని వేకువజామున నూతన వస్త్రాలు, పుష్పాలతో అర్చకులు శోభాయమానంగా అలంకరించి కాగడా హారతితో వేడుకలను ప్రారంభించారు. సాయినాథునికి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల నడుమ సాయిబాబాకు పల్లకీసేవను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకట రమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యలక్ష్మి, పంకజ, సూరీడమ్మ, పద్మ, పీఎల్ఎన్ రాజు, వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

**గోపాలపట్నం:** ప్రశాంతినగర్‌లోని షిర్డీసాయి బాబా ఆలయానికి ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బాబా విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. పాత గోపాలపట్నంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉదయం సాయినామ సంకీర్తన, అనంతరం సామూహిక సత్యవ్రతాలు, ఊరేగింపు, సాయంత్రం పుష్పాభిషేకాలు చేశారు. మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు ఆలయంలో పూజలు చేశారు. అలాగే లక్ష్మీనగర్, ఆర్ఆర్ వెంకటాపురం, కొత్తపాలెం, ఖారవేలనగర్, సంతోశ్‌నగర్‌ల్లోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.

**మల్కాపురం:** శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్దనున్న షిర్డీ సాయిబాబా ఆలయానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ కూడా పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన చేపట్టారు. అలాగే గాజువాక ఆర్టీసీ డిపో వద్దనున్న సాయినాథుని ఆలయంలో జరిగిన పూజల్లోనూ మౌర్యసింహ పాల్గొనగా, ఆయనకు దుశ్శాలువాతో ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రకాశనగర్, మాజీ సైనికుల కాలనీ, మల్కాపురం, షిప్‌యార్డు కాలనీ, శ్రీహరిపురం పవన్‌పుత్రనగర్, తదితర ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. సాయంత్రం ఆయా ప్రాంతాల్లో చేపట్టిన బాబా పల్లకీసేవలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట:** జీవీఎంసీ 52వ వార్డు పరిధి ఎన్ఏడీ అంబేడ్కర్ నగర్‌లోని శ్రీరామ సాయిబాబా ఆలయంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి అర్చన, పాలాభిషేకం, సంకీర్తనార్చన చేపట్టారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం పల్లకీసేవ, గీతాలాపన, పురవీధుల్లో బాబాను ఊరేగించారు. సాయినాథున్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ తదితరులు, దర్శించుకున్నారు. అలాగే నాయుడుతోట సాయిమాధవనగర్‌లో షిర్డీ సాయి ఆలయంలో వేకువజాము నుంచే బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సనపల వెంకట పార్వతీశం ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు.

**పెందుర్తి:** సుజాతనగర్‌లోని షిర్డీ సాయి ఆలయంలోని బాబాకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సాయినాథుని విగ్రహానికి 108 లీటర్లతో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే పల్లకీసేవ, విభూది అభిషేకం, నక్షత్ర హారతి, విశేష అర్చనలు చేశారు. అలాగే 97వ వార్డు పరిధి చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబాకు పూజలు, అభి షేకాలు చేశారు. కార్పొరేటర్ శేనాపతి వసంత శంకరరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆయన అన్న సమారాధనను ప్రారంభించారు. పెందుర్తిలోని ఆలయంలో సాయినాథునికి క్షీరాభిషేకం జరిపారు. రాంపురంలో సనాతన రుషి సేవా సంఘం ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు.



ప్రశాంతినగర్‌లో షిర్డీ సాయిబాబాకు నైవేద్యంగా సమర్పించిన బొబ్బట్లు



పెందుర్తిలో పూజలందుకున్న సాయినాథుడు



సుజాతనగర్‌లోని శివాలయంలో శాకంబరిగా దర్శనమిచ్చిన పార్వతీదేవి

## శాకంబరిగా దర్శనమిచ్చిన పార్వతీదేవి

**పెందుర్తి, జూలై 21:** సుజాతనగర్‌లోని హరిహర క్షేత్ర శివాలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పార్వతీదేవి అమ్మవారిని శాకంబరి అవతారంలో అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, నిమ్మకాయలతో శోభాయమానంగా అలంకరించారు. శాకంబరిగా ఉన్న పార్వతీదేవిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే ఇక్కడి వెంకటాద్రి శిఖరం దిగువన గల మహాకామేశ్వరి ద్వాదశ జ్యోతిర్లింగాలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శాకంబరిగా దర్శనమిచ్చిన మహాకామేశ్వరిని దర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆయల కమిటీ చైర్మన్ దవళ యజ్ఞేశ్వర చైనులు, తదితరులు పాల్గొన్నారు.

## అగనంపూడి సమస్యలపై 'పల్లా'కు వినతి

**అగనంపూడి, జూలై 21:** అగనంపూడి ప్రాంత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆదివారం పలువురు కూటమి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికంగా నెలకొన్న లో వోల్టేజీ సమస్య వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 35 వేల మంది జనాభా ఉన్న ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్థానిక పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకున్నందున నూతన భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో కూటమి నాయకులు బి.సత్యనారాయణ, బి.చందు రమేశ్, వి.శ్రీనివాసరావు, పి.పైడిరత్నం, తదితరులు ఉన్నారు.

**షాపుల నిర్మాణానికి సహకరించాలంటూ..**

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో కమ్యూనిటీ హాల్‌తో పాటు షాపుల నిర్మాణాలకు సహకరించాలని కాలనీ నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. కమ్యూనిటీ హాల్ వద్దనున్న ఖాళీ స్థలంలో షాపుల ఏర్పాటుకు అనుమతించాలని, కాలనీలో కమ్యూనిటీ హాల్‌తో పాటు కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు ఎ.వీర్రాజు, కార్యదర్శి జి.పార్వతీశ్వరరావు, సభ్యులు శ్రీను, రాజు, మోహన్‌రావు ఉన్నారు.

## డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

**విశాఖపట్నం, జూలై 21:** డీఎస్సీకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న బీసీ స్టడీ సర్కిల్ దరఖాస్తుల గడువును ఈనెల 24 వరకూ పెంచింది. ఈమేరకు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. శ్రీదేవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి రూ. 3 వేలు స్టైఫండ్, రెండు నెలల ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 94925 69177లో సంప్రతించాలని సూచించారు.

## ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన 'భెల్' నాయకులు

**అక్కిరెడ్డిపాలెం, జూలై 21:** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌ను భెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆదివారం నగరంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేసి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయడంతో పాటు నూతన ఉద్యోగాలను భర్తీ చేయాలని అసోసియేషన్ నాయకులు కొల్లి దేముడు, కె.పవన్‌కుమార్, పి.ఆదినారాయణ కోరారు.

## 'గాజువాక' అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతా..

**విశాఖలో అంతర్జాతీయ స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు కృషి: విశాఖ ఎంపీ శ్రీభరత్**

**అగనంపూడి టోల్‌గేటు కోసం పిలిచిన టెండర్ల రద్దుకు పోరాడతా: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'**



పల్లా శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న ఫార్మా ఉద్యోగులు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్ ఉన్నారు

**కూర్మన్నపాలెం, జూలై 21:** గాజువాక ప్రజలు ఇచ్చిన అద్భుతమైన మెజారిటీకి ఎప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని, నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో ఫార్మా ప్రతినిధి పొన్నగంటి మురళీమోహన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఫార్మా ఉద్యోగులు, అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, దేశ ఆర్థిక రంగంలో ఫార్మా రంగం ప్రత్యేకతను చాటుకుంటుదన్నారు. ఫార్మా ఉద్యోగులు లేవనెత్తిన పలు సమస్యలపై ఆయన స్పందిస్తూ.. గాజువాకలో ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ నగరం అభివృద్ధిలో భాగంగా అగనంపూడి నుంచి ఆనందపురం వరకు సుమారు 12 వంతెనల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. షీలానగర్ పోర్టు రోడ్డులో మూడు వంతెనలను కలుపుతూ ఒక ఎక్స్‌ప్రెస్ వేను నిర్మిస్తామని శ్రీభరత్ పేర్కొన్నారు. మెట్రో బ్రిడ్జి-రోడ్ కారిడార్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ స్కీమ్ ద్వారా విశాఖలో అంతర్జాతీయ స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ అగనంపూడి టోల్‌గేటు సమస్యను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ టోల్‌గేటు కోసం పిలిచిన టెండర్ల రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. చింత చచ్చినా పులుపు చావదన్నట్టుగా జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జగన్ మాటలు విన్న ప్రజలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం శ్రీభరత్, పల్లాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ప్రతినిధులు బండి సురేశ్‌కుమార్, వీవీ కృష్ణారావు, సురేశ్, బీజేపీ గాజువాక ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు, టీఎస్సార్‌టీబీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ, కూటమి నాయకులు గడసాల అప్పారావు, నల్లూరు సూర్యనారాయణ, ఫార్మా ఉద్యోగులు నల్ల రామారావు, చిగురుపాటి సురేశ్, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెంలో జరిగిన ప్రమాద స్థలిలో లారీలు

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

**డ్రైవరుకు తీవ్ర గాయాలు**

**ప్రమాద సమాచారాన్ని 108కు, అగ్నిమాపక సిబ్బందికి అందించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

**గంటపాటు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరును బయటకు తీసిన వైనం**



లారీ డ్రైవర్‌ను కిందకు దించుతూ..

**అక్కిరెడ్డిపాలెం, జూలై 21:** అక్కిరెడ్డిపాలెం జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో అందులో ఉన్న డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. అక్కిరెడ్డిపాలెం జంక్షన్‌లోని జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం లోడుతో వెళ్తున్న ఓ లారీకి బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కన నిలిపివేశారు. కాగా సాయంత్రం ఐదు గంటల సమయంలో షీలానగర్ నుంచి గాజువాక వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అక్కిరెడ్డిపాలెం కూడలికి వచ్చేసరికి వెనక వస్తున్న కారుకు సైడ్ ఇచ్చేందుకు యత్నించే క్రమంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో బొగ్గు లోడుతో ఉన్న లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న డ్రైవర్ తేజేశ్వరరావు ఇంజన్‌లో ఇరుక్కుపోయాడు. అదే సమయంలో గాజువాక నుంచి నగరం వైపు కారులో వస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రమాద దృశ్యాన్ని చూసి ఆగి 108కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులతో పాటు అక్కడున్న లారీ డ్రైవర్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరును బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. లారీలో తీవ్ర గాయాలతో ఉన్న తేజేశ్వరరావుకు 108 వాహన సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సుమారు గంటపాటు శ్రమించి అయనను బయటకు తీశారు. డ్రైవరుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గిరి ప్రదక్షిణ భక్తులతో కిటకిటలాడిన వేపగుంట కూడలి



వాహనాలు, భక్తులతో రద్దీగా మారిన వేపగుంట జంక్షన్

**వేపగుంట, జూలై 21:** సింహ'గిరి' ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులతో ఆదివారం ఉదయం కూడా వేపగుంట కూడలి భక్తులతో కిటకిటలాడింది. రోడ్డు దాటేందుకు పాదచారులకు సైతం అధిక సమయం పట్టింది. గిరిప్రదర్శనలో పాల్గొన్న భక్తులను వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు సింహపురి కాలనీ, అప్పన్నపాలెం పరిసరాల్లో బస్సులను నిలిపారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు ఒక్కసారిగా బస్సులు, ఆటోలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో నాయుడుతోట నుంచి వేపగుంట కూడలి వరకు వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆర్ఆర్‌వీ పురం కూడలిలోనూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

**కిటకిటలాడిన సింహాచలం రైల్వే స్టేషన్**

**గోపాలపట్నం:** సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని తమ గమ్య స్థానాలకు వెళ్లేందుకు వచ్చిన భక్తులతో సింహాచలం రైల్వే స్టేషన్ రద్దీగా కనిపించింది. గిరి ప్రదక్షిణకు విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రైళ్లలో తరలివచ్చారు. వీరంతా ప్రదక్షిణ ముగించుకుని ఆదివారం ఉదయం నుంచి తమ ఊళ్లకు వెళ్లేందుకు రావడంతో సింహాచలం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది.

## 'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

**అల్లిపురం, జూలై 21:** సీపీఐ, ప్రజా సంఘాల నాయకులపై గత వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయాలని గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పనిచేస్తున్న ప్రజా సంఘాల నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. వీటిని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కకసి రెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రహిమాన్, పి.చంద్రశేఖర్, కె. అచ్యుతరావు తదితరులు ఉన్నారు.

## కన్యకా పరమేశ్వరి దేవస్థానం నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

**మహారాణిపేట, జూలై 21:** నగరంలోని ప్రముఖ కన్యకా పరమేశ్వరి ఆలయ నూతన కార్యవర్గం నియమితులైంది. ఆదివారం ఆలయంలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో 2024-26 సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆరిశెట్టి దినకర్ అధ్యక్షుడిగా, పెనుగొండ కామరాజు కార్యదర్శి, దొమ వెంకట బాలాజీ కుమార్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఏడుగురు ఉపాధ్యక్షులుగా, ఏడుగురు సహాయ కార్యదర్శులు, మరో 28 మంది కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. అనంతరం వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

## వర్షానికి కూలిన ఇల్లు



బాధితుని నుంచి వినతి స్వీకరిస్తున్న టీడీపీ నేత సుజాత, వీఆర్వో

**కంచరపాలెం, జూలై 21:** గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 55వార్డు పరిధి ధర్మానగర్‌లో ఎస్.రవి కుటుంబానికి చెందిన పెంకుటిల్లు ఆదివారం కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న టీడీపీ వార్డు నాయకురాలు ఈ తలపాక సుజాత.. వీఆర్వో బాబూలాల్, వార్డు కమిటీ ప్రతినిధులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి సమస్య తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని బాధితునికి హామీ ఇచ్చారు. వార్డు కమిటీ ప్రతినిధులు బాలకృష్ణ, చంటి పాల్గొన్నారు.

## కబడ్డీ సంఘాలకు న్యాయం చేయాలి



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రమిస్తున్న కబడ్డీ సంఘ ప్రతినిధులు

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 21:** రాష్ట్ర, జిల్లా కబడ్డీ సంఘాలకు కూటమి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర, జిల్లా కబడ్డీ సంఘాల ప్రతినిధులు ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్ గుర్తింపు కలిగిన ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు గత ఐదేళ్లుగా వైసీపీ నాయకుల కబంధ హస్తాల్లో నలిగిపోయి తీవ్ర సమస్యలను ఎదుర్కొన్నారన్నారని రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు ఈ సందర్భంగా వివరించారు. స్పందించిన పల్లా శ్రీనివాసరావు క్రీడాప్రాధికార సంస్థ అధికారికి ఫోన్ చేసి అధికారిక గుర్తింపు కలిగిన కబడ్డీ సంఘాన్ని నిబంధనల ప్రకారం వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధులు బాబూరావు, ఉమాశంకరబాబు, గణపతిరావు, కోటేశ్వరరావు త పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

**కంచరపాలెం, జూలై 21:** స్థానిక ఐటీఐ జంక్షన్ గణేష్‌నగర్‌లో నల్లా దేవి, భర్త అప్పన్న ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నారు. ఈనెల 11న పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లిన దేవి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త అప్పన్న ఫిర్యాదుపై సీఐ భాస్కరరావునేతృత్వంలో హెచ్‌సీ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశం

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 21:** అసోంలో జరిగిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) వార్షిక జనరల్ బాడీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఏపీబీఏ) కార్యదర్శి అంకమ్మ చౌదరి పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈ సమావేశానికి అసోం ముఖ్యమంత్రి హిమాన్త బిష్వ శర్మ హాజరయ్యారు. ఏపీబీఏ కార్యదర్శి అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ఆంధ్రలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు.



సీతమ్మధార ఆలయంలో షిర్డీసాయికి అన్నాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు



అల్లిపురం ఆలయంలో షిర్డీసాయి

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**షిర్డీసాయి ఆలయాల్లో పూజలు**

**సీతమ్మధార, జూలై 21:** సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్ షిర్డీమార్గ్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి పైల సన్నిబాబు ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం అన్నాభిషేకం చేశారు. అనంతరం అన్నదానప్రసాద వితరణ చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో షిర్డీ సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు రామారావు శర్మ, యు. మహేష్ పూలమాలలతో బాబాను అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ప్రసాదం వితరణ చేశారు. 23వ వార్డు చైతన్యనగర్‌లోని వినాయక, సాయిబాబా, అయ్యప్ప స్వామి ఆలయంలో సప్తాయతన ఆలయం సంఘం ఆధ్వర్యంలో సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు. మహిళా భక్త బృందం పాటలు ఆలపించారు.

**డాబాగార్డెన్స్:** డాబాగార్డెన్స్ శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు బులుసు సాయికృష్ణశర్మ బాబాకు పంచామృత అభిషేకం, అన్నాభిషేకం జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవో జీవీ రమాబాయి, కేఎం రెడ్డి పాల్గొన్నారు.

**అక్కయ్యపాలెం:** గ్రేటర్ 43వ వార్డు సంగం ఆఫీసు జంక్షన్ మూడు గుళ్ల సమీపాన సాయిబాబా ఆలయంలో సాయిశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, విశాఖపార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఉత్తర నియోజకవర్గ నేత వెల్లంకి భరత్ హాజరయ్యారు. వీరికి షిర్డీ సాయిశ్వర సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డేటి మోహన్‌రావు ఘన స్వాగతం పలికారు. బాబా చిత్ర పటాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ చైర్మన్ కొయిలాడ వేణుగోపాల్, కార్యదర్శి వాసంశెట్టి మురళీకృష్ణ, కోశాధికారి బొడ్డేటి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**అల్లిపురం:** అల్లిపురం ప్రియాంక విద్యోదయ పాఠశాల సమీపాన శ్రీ సాయి శ్రీమేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిదర్బార్ ప్రాంగణంలోని సాయిబాబాను వెండి మకర తోరణంతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు జరిపారు. పాదుకపూజ, అర్చనలు, ప్రత్యేక పూజల చేశారు.చైర్మన్ ఎస్‌ప్రసన్న, కార్యదర్శి, పి.శ్రీనివాస సుబ్రహ్మణ్య శాస్త్రి, గ్రంధి రమ పాల్గొన్నారు.

**మురళీనగర్:** ఎన్‌జీజీఎస్ కాలనీ, బర్మాక్యాంప్, మాధవధార ప్రాంతాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాధవధార హైస్కూలు సమీపాన శ్రీ గౌరీరామలింగేశ్వర ఆలయ సముదాయంలోని సాయినాథుని ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు హాజరయ్యారు. సాయిబాబాకి అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను మర్యాదలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కమిటీ అధ్యక్షులు టి.నారాయణరెడ్డి, కార్యదర్శి సనపల. వరప్రసాద్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో 56 మంది గురువులకు పూజా కార్యక్రమం చేపట్టారు. బర్మాక్యాంప్ నూకాంబిక ఆలయంలో సాయినాథునికి, మాధవధార, గాంధీనగర్ ఆలయాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు.

**కంచరపాలెం:** కంచరపాలెం పరిసర ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా విశిష్ట పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిక్కవానిపాలెం, గంగన్ననగర్, రెడ్డికంచరపాలెం, తుమ్మడిపాలెం, 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీసాయికి అన్నాభిషేకం, పాలాభిషేకాలు చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ఊంజల్ సేవ నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు.





అలంకరణలో డాబాగార్డెన్స్ షిర్డీసాయి, గండిబాబ్జీకి చిత్రపటం అందిస్తున్న దృశ్యం





నక్కవానిపాలెం , చైతన్యనగర్ మందిరాల్లో అలంకరణల్లో షిర్డీసాయి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

## సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

**మహారాణిపేట:** మహా రాణిపేటలోని కేజీహెచ్ వద్ద ఇసుకకొండ శ్రీ రమా సత్య నారాయణ స్వామి ఆల యంలో ఆదివారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. పౌర్ణమి గుడిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రదక్షిణలు ఆచరించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు సింహాచలం గిరి ప్రదక్షణ పూర్తి చేసిన పలువురు భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతాలను చేశారు.



ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి

# జీవీఎంసీ బలోపేతమే ధ్యేయం

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అతి పెద్ద నగరం విశాఖను ఆర్థికంగా బలోపేతం చేయడమే తెలుగుదేశం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లలో ఏడుగురు తెలుగుదేశం, ఐదుగురు జనసేనలో చేరిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. నగరం అభివృద్ధి చెందాలంటే జీవీఎంసీ కౌన్సిల్ సహకారం అవసరమన్నారు. సుమారు 25 వేలమంది జనాభాకు ఒకరు చొప్పున ప్రాతినిథ్యం వహిస్తున్న కార్పొరేటర్లకు ప్రజలతో నేరుగా సంబంధాలు ఉంటాయన్నారు. కార్పొరేటర్లగా విజయం సాధించాలంటే పార్టీ పలుకుబడి 25 శాతం దోహదం చేస్తే 75 శాతం వ్యక్తిగత చరిష్మా ఉంటుందన్నారు. అందుకే నగరాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైసీపీ కార్పొరేటర్లను కూటమిలోకి ఆహ్వానించామన్నారు. కూటమిలో చేరిన వారిలో సారిపల్లి గోవింద, కంపా హనోక్, బి.నరసింహపాత్రుడు, రాజాన రామారావు, ఇల్లపు వరలక్ష్మి, లొడగల అప్పారావు, కోడూరు అప్పలరత్నం తెలుగుదేశం పార్టీలో, ఆళ్ళ లీలావతి, పెద్దింటి ఉషశ్రీ, కంటిపాముల కామేశ్వరి, పి.పూర్ణశ్రీ, బి.సూర్యకుమారి జనసేన పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిని పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆహ్వానించగా, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కండువా వేసి ఆహ్వానించారు. జనసేనలోకి చేరిన ఐదుగురికి వేదికపై ఆహ్వానించారు. వారికి రెండు మూడురోజుల్లో విజయవాడలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కండువావేస్తారని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రకటించారు.

**మేయరు పీఠంపై గురి**

మేయరుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ప్రస్తుతం ఉన్న గడువు తగ్గించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కూటమిలో చేరిన వారికి తగిన గౌరవం ఉంటుందని, అదే సమయంలో వార్డుల్లో కూటమి నాయకులు, కేడర్‌ను సమన్వయం చేసుకోవాలన్నారు. పార్టీ కేడర్ అధైర్యపడొద్దని హితవు పలికారు. వైసీపీని వీడి రావాలని ఎవరిపైనా ఒత్తిడి చేయలేదని, వారంతా స్వచ్ఛందంగానే పార్టీ మారారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ సూచనల మేరకు ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీని వీడేందుకు ఎక్కువమంది కార్పొరేటర్లు నిర్ణయించారన్నారు. గత మూడేళ్లలో అడ్డగోలుగా వ్యవహరించిన వారిని పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చేవారు టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. వైసీపీ విధానాలకు, కూటమి విధానాలకు చాలా తేడా ఉందని గుర్తుచేశారు. అదే సమయంలో వైసీపీ కార్పొరేటర్లు వచ్చిన వార్డుల్లో టీడీపీ నాయకులు, కేడర్‌కు సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐదేళ్లలో నగరం అనేక రంగాల్లో వెనుకబడిందని, గత పాలకులు విశాఖను నిర్లక్ష్యంచేశారని ఆరోపించారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జీవీఎంసీలో పెద్దఎత్తున అభివృద్ధి జరగాలని పిలుపునిచ్చారు. అధికారమదంతో, బెదిరింపులకు పాల్పడి వైసీపీ జీవీఎంసీలో అధికారం చేజిక్కించుకుందని, ప్రజామోదంతో కాదన్నారు. రాజకీయ సమీకరణలు మారిన తరుణంలో వైసీపీ నుంచి కూటమిలోకి కార్పొరేటర్లను చేర్చుకోవడానికి ఎమ్మెల్యేలను సంప్రదించి వారి అంగీకారం తీసుకున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన కార్పొరేటర్లు కూటమి తరఫున పోటీచేసి ఓడిన అభ్యర్థులు, నేతలు, కేడర్‌ను సమన్వయం చేసుకోవాలని సూచించారు. గేట్లు ఎత్తితే వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందని, అడ్డగోలుగా వ్యవహరించిన వారికి ప్రవేశం లేదన్నారు. వైసీపీమునిగిన నౌకగా అభివర్ణిస్తూ, అందులో ప్రయాణించిన వారంతా ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో అడ్డగోలుగా జరిగిన అవినీతిని వెలికితీసి ప్రజలకు చెప్పాలని పిలుపునిచ్చారు. దక్షిణ ఎమ్మెల్యే చెల్లుబోయిన వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి రాక్షస పాలనకు తెరపడిందన్నారు. జనసేనలో చేరిన వారికి రెండు మూడురోజుల్లో అధినేత పవన్‌కల్యాణ్ కండువాలు వేసి ఆహ్వానిస్తారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పార్టీ నేతలు పొలమరశెట్టి శ్రీనివాసరావు, చోడే పట్టాభి, జనసేన నాయకులు శివప్రసాదరెడ్డి, పసుపులేటి ఉషాకిరణ్, భీశెట్టి వసంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌హాల్ పరిరక్షణకు చర్యలు తీసుకోండి



టౌన్‌హాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**జగదాంబ కూడలి, జూలై 21:** విశాఖ చరిత్రకు ఆనవాలుగా నిలిచిన బ్రిటీషు కాలం నాటి టౌన్‌హాల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రేటర్ 38 వార్డు పరిధిలోని ఈ టౌన్‌హాల్ దుస్థితిపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో ఎక్కడ చూసినా మద్యం, బీరు బాటిళ్లను గుర్తించిన ఆయన అవాక్కయ్యారు. వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి, టౌన్‌హాల్‌ను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ టౌన్‌హాల్‌ను రూ. 10 కోట్లతో ఇటీవల ఆధునికీకరించారు. ప్రస్తుతం టౌన్‌హాల్, విశాఖ క్లబ్ పరిసరాలు గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌లకు నిలయంగా మారాయి. ఈ ప్రాంతం జనసంచారం తక్కువగా ఉండడంతో వీరు టౌన్‌హాల్‌ను అనుకూలంగా మలచుకున్నారు. విశాఖ క్లబ్ సభ్యులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. పాతనగరం వాసులకోసం నిర్మించి వాటర్ ట్యాంకు పరిసరాలు దుర్భరంగా మారాయి. ఈ నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం పర్యటించి పరిస్థితులను పరిశీలించారు.

## జీవీఎంసీలో... రాజకీయ చదరంగం

... 5వ పేజీ తరువాయి

ముగుస్తుంది. తక్షణం కమిటీకి ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. సాధారణ ఎన్నికల హడావుడి, తర్వాత కమిషనర్ బదిలీ వంటి పరిణామాలతో నాలుగు నెలలుగా స్టాండింగ్ కమిటీ సమావేశం జరగలేదు. దీంతో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, రోజువారీ ఖర్చులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీకి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో వచ్చేనెల ఏడున స్టాండింగ్ కమిటీకి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్, ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిర ప్రసాద్ సోమవారం దీనికి సంబంధించి ప్రకటన చేసే అవకాశం ఉంది.

**అప్రమత్తమైన కూటమి నేతలు**

స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు అప్రమత్తమయ్యారు. సాధారణ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేయడంతో జీవీఎంసీ మేయర్ పీఠంతోపాటు స్టాండింగ్ కమిటీని కూడా కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీని కోసం కౌన్సిల్‌లో బలం పెంచుకునే చర్యలు ప్రారంభించారు. జీవీఎంసీలో ప్రస్తుతం వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు, టీడీపీకి 29 మంది, జనసేనకు ఐదుగురు కార్పొరేటర్ల బలం ఉంది. వీరుకాకుండా బీజేపీ, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఉన్నారు. తాజాగా ఆదివారం 12 మంది కార్పొరేటర్లు వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. వీరిలో ఏడుగురు టీడీపీలో, ఐదుగురు జనసేనలో చేరిపోయారు. దీంతో టీడీపీ బలం 36కి, జనసేన బలం పదికి మొత్తంగా బీజేపీతో కలుపుకుంటే కూటమి బలం 47కి పెరిగింది. అదే సమయంలో వైసీపీ బలం 47కి తగ్గిపోయింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా, ఒక్కస్థానం దక్కించుకోవాలంటే 97 మంది కార్పొరేటర్లలో కనీసం 49 మంది మద్దతు అవసరం. అంటే ఇరుపక్షాలకు మరో ఇద్దరు సభ్యులు మద్దతు కావాలి. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ప్రస్తుతం వైసీపీకి మద్దతు ఇస్తుండగా, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల నిర్ణయం కీలకంగా మారనుంది. వీరిద్దరూ కూటమికి మద్దతు తెలిపితే కూటమి అభ్యర్థులు, ఒకవేళ వైసీపీకి మద్దతిస్తే వైసీపీ సభ్యులు స్టాండింగ్ కమిటీలో విజయం సాధిస్తారు. ఈ నేపథ్యంలో మరో పది మంది కార్పొరేటర్లను చేర్చుకునే దిశగా కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. వారంతా వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు, వార్డులోని నేతలు, కార్యకర్తల అభ్యంతరాల నేపథ్యంలో తీసుకోలేదని ప్రచారం జరుగుతోంది. అభ్యంతరాల్లేని కార్పొరేటర్లలో కనీసం పది మందిని చేర్చుకుంటామని కూటమి నాయకులు ప్రకటించడంతో వైసీపీ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పుడున్న 47 మంది కార్పొరేటర్లు చేజారిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహరచన చేస్తున్నారు. కొత్తగా కార్పొరేటర్ల చేరికల నేపథ్యంలో టీడీపీ, జనసేన కార్పొరేటర్లలో నెలకొన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని యత్నిస్తున్నారు. వారి మద్దతుని రాబట్టుకోవడం ద్వారా స్టాండింగ్ కమిటీలో సగం స్థానాలైనా కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఇన్‌చార్జి వీసీకి సవాళ్లు

... 5వ పేజీ తరువాయి

లేకుండానే పనులు కట్టబెట్టినట్టు చెబుతారు. ఐదేళ్లలో వర్సిటీకి వచ్చిన నిధులు, వినియోగించిన తీరు, అభివృద్ధికి వెచ్చించిన మొత్తాలపై ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ పేరుతో నిధుల దుర్వినియోగంపైనా నిగ్గుతేల్చాలంటున్నారు.

**ఎత్తేసిన సబ్జెక్టుల పరిస్థితి..?**

అడ్మిషన్లు తగ్గాయంటూ గత పాలకులు కొన్ని సబ్జెక్టులకు మంగళం పాడే శారు. వీటిని పునరుద్ధరించాల్సి ఉంది. ఆయా విభాగాల్లో పనిచేసిన 250 మందికిపైగా గెస్ట్‌ఫ్యాకల్టీను తొలగించారు. దూరవిద్యను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. బయటి నుంచి వచ్చిన ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇక్కడి నుంచే ప్రక్షాళన ప్రారంభించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. డబ్బు వసూలు చేసి పరీక్ష కేంద్రాల సంఖ్యను పెంచడం, ఎత్తేసిన స్టడీ సెంటర్లను పునరుద్ధరించడం, ఎయిడెడ్ కాలేజీల నుంచి తీసుకువచ్చిన సిబ్బందిని వెనక్కి పంపడం వంటి అంశాలపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి నెలకొంది. వర్సిటీలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌తోపాటు అవసరం లేకున్నా మరో 50 మంది ప్రైవేట్ సెక్యూరిటీని గత వీసీ నియమించారు. దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది.

**వృక్షాల తొలగింపు, రవాణాపై..**

వర్సిటీలోని అనేక విభాగాల వద్ద వందలాది వృక్షాలను తొలగించారు. నార్త్ క్యాంపస్‌లో చెట్లు, వృక్షాలను కూల్చి మైదానం చేసేశారు. ఈ కలపను అక్రమంగా తరలించారన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఇక్కడ భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేయించారు. ఇందుకు వర్సిటీ నిధులు వెచ్చించినట్టు చెబుతున్నారు. ఎవరి స్వలాభం కోసం ఇదంతా చేశారో తేల్చాల్సి ఉంది. ఇప్పటికీ వర్సిటీలోని విద్యార్థులకు గంజాయి సరఫరా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సెక్యూరిటీని పటిష్టం చేయడంతోపాటు ఈ తరహా వ్యవహారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**విచారణకు ఆదేశించే అవకాశం..**

వర్సిటీలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈలోగానే ఇన్‌చార్జి వీసీ సమీక్షించి సమాచారాన్ని సేకరించడం మేలంటున్నారు. దీంతో పాటు వర్సిటీలోని కీలక అంశాలపై దృష్టి సారించి చక్కదిద్దాల్సి ఉందని చెబుతున్నారు.

## తహసీల్దార్ల పైరవీలు!

... 5వ పేజీ తరువాయి

సెలవులో వెళ్లేందుకు యోచిస్తున్నారని తెలిసింది. కాగా విస్తీర్ణం పరంగా జిల్లా చిన్నదైనా ఇక్కడ భూములకు విలువ ఎక్కువ. వందల ఎకరాలకు సంబంధించి కోర్టు కేసులు ఉండడం, రాష్ట్రంలో ఎక్కువగా జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఎంతో ప్రాధాన్యత ఉంది. అందువల్ల సమర్థులను తహసీల్దార్లుగా నియమించాలని జిల్లా అధికారులు యోచిస్తున్నారు. అయితే కీలక మండలాల్లో పోస్టింగ్ కోసం పలువురు రాజకీయ నేతల చుట్టూ తిరుగుతూ సిఫారసు లేఖలు సంపాదిస్తున్నారు. దీంతో పోస్టింగ్‌ల వ్యవహారంలో ఇప్పటికే కలెక్టర్‌పై ఒత్తిడి మొదలైందని ప్రచారం సాగుతోంది.

## పులకించిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

ఆధ్యాత్మిక సంస్థ కదంబం, దద్దోజనం, చక్కెర పొంగలి, ఒడిశాకు చెందిన ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడి బృందం పులిహోర, సింహగిరి వర్తకుల సంఘం ఆధ్వర్యంలో పొంగలి ప్రసాదాలను వితరణ చేశారు. ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవం విజయవంతం కావడానికి కృషి చేశారు.

**సేవలందించిన 45 ఆర్టీసీ బస్సులు**

దేవస్థానం సుమారు రూ.10 లక్షలు చెల్లించి 45 ఆర్టీసీ బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగించింది. అవన్నీ రద్దీగా మారడంతో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన రాకపోకలు సాగించారు. తొలిపావంచా వద్ద భక్తులు లక్షలాదిగా కొబ్బరికాయలను కొట్టి ప్రదక్షిణలను ప్రారంభించడంతో టన్నుల కొద్దీ కొబ్బరిముక్కలు పోగయ్యాయి. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్టర్ వ్యాన్‌లు ఏర్పాటు చేసి, జేసీబీ సాయంతో వాటిని ఎప్పటికప్పుడు తరలించారు.

## విజయవాడ కనకదుర్గకు సారె సమర్పణ



కనకదుర్గకు సారె సమర్పిస్తున్న కనకమహాలక్ష్మి ఆలయ అధికారులు

**పూర్ణామార్కెట్, జూలై 21:** విజయవాడ కనక దుర్గ అమ్మవారికి కనక మహాలక్ష్మి దేవస్థానం తరపున ఆదివారం సారె అందజేశారు. ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి వి. రాంబాబు, ప్రధాన అర్చకులు కె. శ్రీనివాస శర్మ, వేదపండితులు సీహెచ్‌ఎల్‌ఎన్ అవధానులు, హనుమాన్ శర్మ దుర్గమ్మ ఆలయానికి వెళ్లి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. దుర్గమ్మ శాకంబరి ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో అక్కడి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## వెలిగిన వీధి దీపాలు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**



పూర్ణామార్కెట్ రోడ్డులో వెలుగుతున్న దీపాలు

**జగదాంబ కూడలి, జూలై 21:** వన్‌టౌన్‌లోని వాచ్‌హౌస్ శివాలయం మెయిన్ రోడ్డు నుంచి పూర్ణామార్కెట్ వరకు వీధి దీపాలను జీవీఎంసీ విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరించారు. ఇటీవల 'ఆంధ్ర జ్యోతి'లో 'వన్‌టౌన్‌లో అంధకారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు వీధి దీపాలను మార్చారు. సమస్య పరిష్కారంతో వ్యాపారులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కూలిన భారీ వృక్షం

**మధురవాడ, జూలై 21 :** మధురవాడ స్వతంత్రనగర్ కాలనీలో ఆదివారం ఉదయం ఓ ఇంటిపై భారీ వృక్షం నేల కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో వైర్లు నేలపై పడ్డాయి. వెంటనే విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమై సరఫరాను నిలిపివేశారు. కాగా వర్షాలకు మధురవాడలో మూడు ఎల్‌టీ విద్యుత్ లైన్ స్తంభాలు ఒరిగిపోవడంతో వాటిని తొలగించి కొత్త స్తంభాలు వేశారు.

## ముగిసిన సత్యభామ నృత్యోత్సవాలు

**మద్దిలపాలెం, జూలై 21 :** పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యభామ యువ నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యాలు ఆహూతలను అలరించాయి. హైదరాబాద్ కళాకృతి నృత్యాలయం చిన్నారుల నృత్యాలు మైమరిపించాయి. తమిళనాడు సంప్రదాయ భరతనాట్యం కనువిందు చేసింది. అనంతరం పోటీల్లో గెలుపొందిన కళాకారులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీ రమణమూర్తి, బీఆర్. విక్రమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 80 మంది రక్తదానం

**భీమునిపట్నం, జూలై 21 :** పట్టణంలోని నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, యరబాల ఛారిటీస్ ఆధ్వర్యంలో ఆదివారం ది సన్ స్కూల్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విశాఖ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది 80 మంది దాతల నుంచి రక్తం సేకరించారు.ఈ కార్యక్రమంలో బీఎన్‌డబ్ల్యూ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, యరబాల ఛారిటీస్ ఛైర్మన్ యరబాల అనిల్‌ప్రసాద్, గంటా నూకరాజు, శివ ప్రసాద్, సీతా రామరాజు, డాక్టర్ ఎన్ఎల్‌రావు, ఎం. సూర్య శ్రీనివాస్, ముమ్మిడిశెట్టి ఆదిత్య, వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## హోమియో మందులు పంపిణీ

**భీమునిపట్నం, జూలై 21 :** పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 105 మందికి మందులు పంపిణీ చేశారు. చిన్నబజారు డచ్‌రోడ్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఆవరణలో జరిగిన ఈ శిబిరాన్ని సంస్థ ఛైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి. జగన్నాథరావు, మోహన్ రోగులను పరీక్షించి, మందులు అందించారు.

## ఆటోలో నుంచి జారి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

**ఆరిలోవ, జూలై 21 :** పాత డెయిరీ ఫారం నుంచి ఎండాడ వైపు వెళుతున్న ఆటోలో నుంచి జారి పడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎండాడ వైపు ఆటోలో వెళుతున్న వ్యక్తి ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటో ఆగకుండా దిగడానికి ప్రయత్నించి, జారి పడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించినట్టు ఆరిలోవ పోలీసులు తెలిపారు. బాధితుడి వివరాలు తెలియరాలేదు.

## జనసేన సభ్యత్వ నమోదు

**కొమ్మాది, జూలై 21 :** జనసేన సభ్యత్వాల నమోదుకు విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ ఆరో వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన పీఎంపాలెంలో జనసేన సభ్యత్వాల నమోదు చేపట్టారు.

## టీడీపీ కార్యాలయంలోకి జారి పడిన రాళ్లు

**విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :** నగరంలో మూడు రోజులగా కురుస్తున్న వర్షాలకు టీడీపీ కార్యాలయం పక్కనున్న గుట్ట నుంచి ఆదివారం ఉదయం రాళ్లు, మట్టి పెల్లలు జారిపడ్డాయి. సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక దసపల్లా భూములకు ఆనుకుని టీడీపీ కార్యాలయం ఉంది. కార్యాలయం ప్రాంగణానికి ఆనుకుని పెద్ద బండరాళ్లు ఉన్నాయి. గతంలో ఒకటి రెండుసార్లు గుట్ట నుంచి రాళ్లు దొర్లి కార్యాలయం ఆవరణలో పడ్డాయి. సాధారణంగా కార్యాలయానికి వచ్చిన వారు ఎక్కువగా గుట్టకు ఆనుకుని ఉన్న గోడ సమీపంలో నిల్చుని మాట్లాడుతుంటారు. రాళ్లు పడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## నేటి నుంచి చట్టాలపై అవగాహన

**ఆరిలోవ, జూలై 21 :** కేంద్ర కారాగారంలో జైళ్ల శాఖ అధికారులకు మూడు రోజుల పాటు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

## సినిమా గైడ్

● **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)

● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),

● **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),

● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36,టమాటా 56, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 16, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 40, బీరకాయలు 24, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజి 34, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 145, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 95 |
| ఫారం ధర | -- | 115 |
| విత్ స్కిన్ | -- | 200 |
| స్కిన్‌లెస్ | -- | 210 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



వర్షం పడడంతో టెంట్ల కింద ఉన్న భక్తులు



యువతుల సెల్ఫీ



పాత గోశాల వద్ద గిరి ప్రదక్షిణ ముగించుకుని వెళుతున్న భక్తులు

# భక్త జనగిరి

### ముగిసిన సింహగిరి ప్రదక్షిణ

సింహగిరి ప్రదక్షిణ ఆదివారంతో పూర్తయింది. ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికారులు ఉత్సవాన్ని విజయవంతంగా ముగించారు. ఒకవైపు గిరి ప్రదక్షిణ, మరోవైపు గురుపౌర్ణమి పురస్కరించుకుని వేలాది మంది భక్తులతో సింహగిరి కిటకిటలాడింది. ఉదయం కురిసిన భారీ వర్షం వల్ల కొంతమేర ఇబ్బందులు ఏర్పడ్డాయి. తిరుగు ప్రయాణంలో బస్సుల వద్ద విపరీతమైన రద్దీ నెలకొనడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. - సింహాచలం



నిలిచిపోయిన బస్సును నెడుతున్న భక్తులు



పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రైవేటు వాహనం

# వాడవాడలా గురుపౌర్ణమి





ఈస్ట్‌పాయింట్ కాలనీలో సాయినాథునికి పూజలు, కొత్త వెంకోజీపాలెంలో బాబాకు నైవేద్యం

**వెంకోజీపాలెం, జూలై 21 :** తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్నిచోట్లా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తుల సాయి నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. పాతవెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో సాయినాథునికి పంచామృతాభిషేకం, విభూది, చందనాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం అర్చకులు రంపా రామ్మోహన్‌శర్మ, రంపా మురళీశర్మ ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. భక్తులతో అన్నాభిషేకం నిర్వహించి ఆ అన్నంతో మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.సాయంత్రం బాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు.కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశి, కార్యవర్గ సభ్యులు కర్రి శ్రీను, యల్లపు నాగరాజు, ఆడారి శివ ప్రకాష్, పొలమరశెట్టి త్రినాథ్, మళ్ల రవికుమార్, పాల్గొన్నారు. కొత్త వెంకోజీపాలంలోని సాయిబాబా ఆలయంలో గ్రామ సేవా సంఘం, శ్రీ సద్గురు సాయినాథ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ గురుపౌర్ణమి ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ప్రభాకర్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి తెల్లవారుజాము నుంచి సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నంతో అన్నాభిషేకం చేసి అనంతరం అన్నాన్ని ప్రసాదంగా పంచి పెట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం ప్రత్యేక రథంలో స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే యల్లమాంబ నగర్ కాలనీ, హెచ్‌బీకాలనీ శివాలయం సముదాయంలో ఉన్న సాయిబాబా ఆలయంలోనూ ఉత్సవాలు వైభవంగా చేపట్టారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు.

**మధురవాడ :** మధురవాడ పరిసరాల్లోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించారు. ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత సుందరీ సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో షిర్డీసాయికి పూజలు చేశారు. అనంతరం అన్నాభిషేకం, అమ్మవారికి అభిషేకాలు జరిపారు. స్వతంత్రనగర్‌కాలనీలోని షిర్డీ సాయి ఆలయంలోనూ సాయినాథ్‌కి అభిషేకాలు చేసి అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

**సింహాచలం :** జీవీఎంసీ 98వ వార్డు శివారు విజినిగిరిపాలెంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన షిర్డీ సాయినాథుని సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు ఉదయ్‌కృష్ణశర్మ వేకువజామున బాబాకు విశేష అర్చనలు జరిపారు. అనంతరం భక్తుల దైవనామ స్మరణ నడుమ క్షీరాభిషేం, పంచామృతాభిషేకాలు జరిపి అన్నాభిషేకం నిర్వహించారు. జగద్గురు ఆదిశంకరాచార్యులకు కూడా ప్రత్యేకాభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**తగరపువలస :** చిట్టివలస కొండపేటలో ఉన్న స్వామి యోగానంద ప్రార్థనా మందిరంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకలను కేజీహెచ్ సూపరింటెండెంట్ పి. శివానంద ప్రారంభించారు. అనంతరం ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నిరుపేదలకు వస్త్ర దానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**ఆరిలోవ :** ఆరిలోవలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చినగదిలిలోని షిర్డీసాయిబాబా ఆలయంలో చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఉదయం పూజలు, అభిషేకాలు జరిపారు. బాబాను గులాబీ శాలువలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. అలాగే ఆదర్శనగర్, సంజయ్ గాంధీ కాలనీల్లోని ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఎండాడ :** జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న కోదండ రామాలయం, గణపతి, పశుపతినాథేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని అర్చకుడు సుసరపు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో విశిష్ట పూజలు, అన్నాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. 9వ వార్డు పరిధిలోని విశాలాక్షినగర్‌లో ఉన్న కోదండ రామాలయం సముదాయంలో ఉన్న సాయిబాబా ఆలయంలో గురుస్వామి నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కైలాసగిరి కూడలిలో ఉన్న సద్గురు సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుడు రుద్రరాజు రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం పల్లకి సేవ, విశాలాక్షినగర్ మహిళా బృందం వారి కోలాటం మధ్య ఊరేగింపు చేపట్టారు.

**మద్దిలపాలెం :** జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో శ్రీకృష్ణసేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, సంఘం నిర్వాహకులు దువ్వి మంగరాజు, అప్పలమూర్తి పాల్గొన్నారు.

**కొమ్మాది :** చంద్రంపాలెం జాతరగుట్ట ఆవరణలో ఉన్న దుర్గాలమ్మ ఆలయ సన్నిధిలోని షిర్డీ సాయి ఆలయంలో సాయినాథుడికి అన్నాభిషేకం నిర్వహించి, అనంతరం మహాన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు పాల్గొన్నారు. అలాగే కార్పెంటర్స్‌కాలనీలోని సాయిబాబా ఆలయంలోనూ, పీఎంపాలెం ఆఖరి బస్టాప్ షిర్డీ సాయినాథుడి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

**ఎంవీపీ కాలనీ :** ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ఎంపైర్‌లో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఓం యోగా వ్యవస్థాపకుడు, యోగా గురువు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గురుపూర్ణిమ విశిష్టతను వివరించారు. తల్లిదండ్రులను కూడా గురువులుగా భావించాలని పేర్కొన్నారు. అనంతరం శిష్య బృందం రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాంతారావు, సురేష్ బాబు, శర్మ, వరలక్ష్మి, దేవి, రూప పాల్గొన్నారు.

**పెదవాల్తేరు :** నగరంలోని ఈస్టుపాయింట్ కాలనీలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయినాథుడ్ని వివిధ రకాల పండ్లు, స్వీట్లతో కమిటీ సభ్యులు అలంకరించారు. ముందుగా బాబాకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు.ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాయి మందిరం భక్తులతో కిటకిట లాడింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్బులు, మణిదార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చినవాల్తేరు ఈస్టు పాయింట్ కాలనీలో ఉన్న లేండివనంలోనూ గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**పద్మనాభం :** మండలంలోని పలు గ్రామాల్లో గురుపూర్ణిమ వైభవంగా నిర్వహించారు. పద్మనాభం, రెడ్డిపల్లి, శేరిఖండం, అయినాడ గ్రామాల్లోని షిరిడీ సాయి ఆలయాల్లో సాయినాథుడికి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు. శేరిఖండం షిరిడీ సాయి ధ్యాన మందిరం ఆధ్వర్యంలో సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సంగు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గంటాను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

**భీమునిపట్నం (రూరల్), జూలై 21 :** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు భీమిలికి చెందిన కేవస్ నాయుడు, విజయనగరానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో వారు గంటాను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవోను రద్దును చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను ఆదుకోవాలన్నారు. తల్లికి వందనం పథకం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేయాలని విన్నవించారు. అలాగే ఎంపీ శ్రీభరత్‌ను కూడా వారు కలిసి వినతిపత్రం అందజేశారు.

**కొమ్మాది :** బక్కన్నపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిలో భాగంగా రేవళ్ల పాలెంలో తొలగించిన ఇళ్లకు నష్టపరిహారం, టీడీఆర్ చెల్లించాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. ఆదివారం వారు గంటాను ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగోతి వెంకట్రావు, పోతిన శ్రీనివాసరావు, ఇల్లిపిల్లి సూరిబాబు, వాండ్రాసి వెంకట అప్పారావ, పిళ్లా రమణ పాల్గొన్నారు.

## భీమిలిలో సౌమ్యగిరి ప్రదక్షిణ



సౌమ్యగిరి ప్రదక్షిణలో పాల్గొన్న పట్టణవాసులు

**భీమునిపట్నం, జూలై 21 :** పట్టణంలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి సౌమ్యగిరి ప్రదక్షిణ ఆదివారం భక్తి శ్రద్ధలతో సాగింది. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల లక్ష్మీనృసింహ ప్రసాదాచార్యులు కొండ దిగువ గాలిగోపురం వద్ద కొబ్బరికాయు కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. అక్కడి నుంచి నేరేళ్లవలస కాలనీ, నేరేళ్లవలస అగ్రహారం, కృష్ణాకాలనీ, చిన్నబజారు జంక్షన్, పాత బస్టాండ్, గంట స్తంభం మీదుగా శివ, కేశవ ఆలయాల వద్దకు చేరింది. మార్గమధ్యలో భక్తులు నేరేళ్లవలస కాలనీలో సంపత్ వినాయక ఆలయాన్ని, నేరేళ్లవలసలో ఉగ్రనరసింహ ఆలయాన్ని, పద్మావతి గార్డెన్స్‌లో వెంకటేశ్వర ఆలయాన్ని, గొల్లలపాలెంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. భక్తుల హరి నామస్మరణలతో పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రియులు అల్లం రామకృష్ణ, ముమ్మిడిశెట్టి సత్యానందరావు, గుర్రాల సత్యనారాయణ, కందుకూరి మంగరాజు, రేలంగి అప్పలనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అర్చకునిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

**పద్మనాభం/పద్మనాభం రూరల్, జూలై 21 :** పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెం గ్రామంలో సహాయత హెల్పింగ్ హేండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. వైద్యులు 200 మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అలాగే వైద్య శిబిరంలో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సన్యాసిరావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించాలని రైతుల ధర్నా



హుద్‌హుద్ ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న రైతులు

**కొమ్మాది, జూలై 21 :** హుద్‌హుద్ తుఫాన్ బాధితుల కోసం బక్కన్నపాలెంలోని నవోదయా విద్యాలయం వెనుక సినీ పరిశ్రమ నిధులతో చేపట్టిన ఇళ్ల వద్ద నిర్వాసిత రైతులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపరిహారంగా ఇస్తామన్న ఇళ్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.

## అప్పన్నకు తుది విడత చందన సమర్పణ

**సింహాచలం, జూలై 21 :** వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఏడాది పొడవునా పైపూతగా ఉండే చందనాన్ని ఆదివారం తెల్లవారుజామున తుది విడతగా ఆలయ వైదికులు సమర్పించారు. ఏడాదికి ఒకసారి స్వామివారిపై పన్నెండు మణుగుల (500 కిలోల) చందనపు ముద్దను నాలుగు విడతల్లో పైపూతగా సమర్పించడం ఆనవాయితీ. తొలివిడత చందనాన్ని వైశాఖమాస శుక్లపక్ష తృతీయనాటి అక్షయ తృతియ నాడు అనగా చందనోత్సవం నాడు, రెండో విడత వైశాఖ పౌర్ణమినాడు, మూడో విడత జేష్ఠపౌర్ణమినాడు మూడేసి (125 కిలోల) మణుగుల చొప్పున చందనపు ముద్ద సమర్పించారు. తుదివిడత ఆషాడమాస పూర్ణిమ పురస్కరించుకుని ఆదివారం వేకువజామున సుప్రభాత సేవ అనంతరం స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారిపై పూతగా వేశారు. అదే చందనాన్ని ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, ఆళ్వార్లపై కూడా ఉంచి షోడశోపచారాలు సమర్పించి ప్రత్యేక పూజలు అనంతరం తెల్లవారుజామున మూడు గంటలకు భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

**అక్కిరెడ్డిపాలెం, జూలై 21:** అక్కిరెడ్డిపాలెం జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో అందులో ఉన్న డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కిరెడ్డిపాలెం జంక్షన్‌లోని జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం లోడుతో వెళ్తున్న ఓ లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కన నిలిపివేశారు. కాగా సాయంత్రం ఐదు గంటల సమయంలో షీలానగర్ నుంచి గాజువాక వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అక్కిరెడ్డిపాలెం కూడలికి వచ్చేసరికి వెనక వస్తున్న కారుకు సైడ్ ఇచ్చేందుకు యత్నించే క్రమంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో బొగ్గు లోడుతో ఉన్న లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న డ్రైవర్ తేజేశ్వరరావు ఇంజన్‌లో ఇరుక్కుపోయాడు. అదే సమయంలో గాజువాక నుంచి నగరం వైపు కారులో వస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రమాద దృశ్యాన్ని చూసి ఆగి 108కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులతో పాటు అక్కడున్న లారీ డ్రైవర్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరును బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. లారీలో తీవ్ర గాయాలతో ఉన్న తేజేశ్వరరావుకు 108 వాహన సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సుమారు గంటపాటు శ్రమించి ఆయనను బయటకు తీశారు. డ్రైవరుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు నడముకు తీవ్ర గాయాలయ్యాయి.

# విశాఖలో అంతర్జాతీయ స్పోర్ట్స్ స్టేడియం

▸▸ విశాఖ ఎంపీ శ్రీభరత్

▸▸ అగనంపూడి టోల్‌గేటు కోసం పిలిచిన టెండర్ల రద్దుకు పోరాడతా : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'

**కూర్మన్నపాలెం, జూలై 21:** గాజువాక ప్రజలు ఇచ్చిన అద్భుతమైన మెజారిటీకి ఎప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని, నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో ఫార్మా ప్రతినిధి పొన్నగంటి మురళీమోహన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఫార్మా ఉద్యోగులు, అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, దేశ ఆర్థిక రంగంలో ఫార్మా రంగం ప్రత్యేకతను చాటుకుంటుదన్నారు. ఫార్మా ఉద్యోగులు లేవనెత్తిన పలు సమస్యలపై ఆయన స్పందిస్తూ.. గాజువాకలో ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ నగరం అభివృద్ధిలో భాగంగా అగనంపూడి నుంచి ఆనందపురం వరకు సుమారు 12 వంతెనల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. షీలానగర్ పోర్టు రోడ్డులో మూడు వంతెనలను కలుపుతూ ఒక ఎక్స్‌ప్రెస్ వేను నిర్మిస్తామని శ్రీభరత్ పేర్కొన్నారు. మెట్రో బ్రిడ్జి-రోడ్ కారిడార్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ స్కీమ్ ద్వారా విశాఖలో అంతర్జాతీయ స్పోర్ట్స్ స్టేడి యం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ అగనంపూడి టోల్‌గేటు సమస్యను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ టోల్‌గేటు కోసం పిలిచిన టెండర్ల రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. చింత చచ్చినా పులుపు చావదన్నట్టుగా జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జగన్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని విమర్శించారు. అనంతరం శ్రీభరత్, పల్లాను ఘనంగా సత్కరించారు.



పల్లా శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న ఫార్మా ఉద్యోగులు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్